ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



హైదరాబాద్‌కు ముద్రగడ తరలింపు

మెరుగైన చికిత్స కోసం యశోద ఆసుపత్రిలో చేర్పించిన కుటుంబసభ్యులు

మరిడమ్మ జాతరకు పోటెత్తిన భక్తులు

7

గ్రీన్ సిగ్నల్

- డిగ్రీ అడ్మిషన్లకు ప్రభుత్వం అనుమతి
- ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులకు అవకాశం

6

ఇండస్ట్రియల్ ఏరియా లోకల్ అథారిటీకి బదలాయింపు

కాకినాడ, జూలై 21(ఆంధ్రప్రదేశ్): కాకినాడ జిల్లా తొండంగి మండలం ఒంటిమామిడి, కోదాడ గ్రామ పంచాయతీలకు సంబంధించిన భూమిని ఏపీఐఐసీకి బదలాయిస్తూ ప్రభుత్వం సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీచేసింది. ఒంటిమామిడి, కోదాడ గ్రామ పంచాయతీల్లో 505 ఎకరాలకు సంబంధించి రెవెన్యూ వాటా నిష్పత్తి గ్రామ పంచాయతీలకు, ఏపీఐఐసీకి 60:40గా నిర్ణయించినట్టుగా పేర్కొన్నారు. ఇండస్ట్రియల్ ఏరియా లోకల్ అథారిటీ ద్వారా ఈ నిధులు పౌర సౌకర్యాల కల్పనలో వినియోగించాలని సూచించారు. ఏపీఐఐసీ, దివీస్ లేబొరేటరీస్ లిమిటెడ్ ఈ సర్వే నంబర్లలోని 8.08 ఎకరాల భూమిని యథాస్థితిగా ఉంచి వినియోగించుకునేలా ఉత్తర్వులిచ్చారు.

జిల్లాలో పీ4 గ్రామసభలను పక్కాగా నిర్వహించాలి : కలెక్టర్

కలెక్టరేట్ (కాకినాడ), జూలై 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పీ4 గ్రామసభలను పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లోని కోర్టు సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాస్థాయి అధికారులు అందరూ తమ శాఖల పరిధిలో పీ4 కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లాలన్నారు. పేదరికంలో ఉన్న బంగారు కుటుంబాలను గుర్తించేందుకు గ్రామసభలను తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. జిల్లాలో 1.2 లక్షల బంగారు కుటుంబాలను గుర్తించగా, ఇప్పటివరకు 6,149 బంగారు కుటుంబాలను మార్గదర్శకులు స్వీకరించారన్నారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగీ మార్గదర్శిగా బంగారు కుటుంబాలను ఈనెల 26వ తేదీ నాటికి స్వీకరించాలన్నారు. ఆగస్టు ఒకటో తేదీ నుంచి ప్రతి ప్రభుత్వ ఉద్యోగి ఐదు మంది మార్గదర్శులను గుర్తించాలన్నారు. వారి ద్వారా ఐదేసి బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలన్నారు. ఆ కుటుంబాలను సందర్శించి వారి సమస్యలను ఎలా అధిగమించాలో ప్రణాళికలు రూపొందించాలన్నారు. డీఆర్వో వెంకట్రావు, సీపీవో త్రినాథ్, గృహ నిర్మాణ శాఖ పీడీ సత్యనారాయణ, వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకుడు విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్

జ..గన్.. మిథున్..!





బాస్ కోసం జిల్లాలో బరితెగింపు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి అరాచకాలు, అక్రమాలకు, దందాలకు లెక్కేలేదు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కోఆర్డినేటర్‌గా అధికారం చెలాయించారు. వంతాడ మైనింగ్‌పై కన్నేసి లీజుదారులను బెదిరించి వాటాలు కొట్టేశారు. అప్పటి సీఎం జగన్ భారతి సిమెంట్ కంపెనీకి ఇక్కడి నుంచి రిజర్వ్ ఫారెస్ట్‌ను తవ్వేసి మరీ లేటరైట్ పంపించారు. జగన్ కోసం కాకినాడ పోర్టు,కాకినాడ సెజ్ యజమానులను బెదిరించి వాటాలను అరబిందో కంపెనీకి రాయించడం కోసం ఏకంగా బెదిరింపులకు దిగారు. వందలకోట్ల పేదల ఇళ్ల స్థలాల చదునులో కాకినాడ సిటీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడితో కలిపి కోట్లకు కోట్లు కొట్టేశారు. గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మద్యం కుంభకోణంలో సంపాదించిన అక్రమ సొమ్మునే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో నియోజకవర్గాలకు తరలించి టీడీపీని ఓడించడానికి మిథున్‌రెడ్డి స్కెచ్ అమలుచేశారు. అప్పటి సీఎం జగన్ అండదండలతో ఉమ్మడి జిల్లాలో మిథున్ రెడ్డి రెచ్చిపోయారు. రూ.3,200 కోట్ల మద్యం కుంభకోణంలో కీలక సూత్రధారిగా అరెస్టయి రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో ఉన్నారు.

బెదిరించి..వాటాలు కొట్టేసి..

కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం వంతాడ కొండల్లో లేటరైట్ సిమెంట్ తయారీ, అల్యూమినియం ఉత్పత్తికి ఆధారం. పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన ఆంధ్రు శ్రీనివాస్ 2013లో వంతాడ కొండపై 20 ఏళ్ల పాటు 200 ఎకరాల్లో లీజులు దక్కించుకున్నారు. 41.25 లక్షల మెట్రిక్ టన్నుల లేటరైట్ గనులపై జగన్ ఆదేశాలతో మిథున్‌రెడ్డి కన్నేశారు. లీజుదారుడిని బెదిరించి బలవంతంగా డీల్ కుదిర్చారు. దీని ద్వారా ఏడాదికి అప్పటి ప్రభుత్వ పెద్దలు రూ.180 కోట్లు వెనకేసుకున్నారు.

రిజర్వ్‌ఫారెస్ట్ తవ్వించేశారు...

విశాఖ జిల్లా నాతవరం మండలం బమిడికిలొద్దు వద్ద లేటరైట్ కొండలపై జగన్ కన్ను పడింది. లీజుదారుడిని దారికితెచ్చుకుని మిథున్ రెడ్డి వాలిపోయారు. తవ్విన లేటరైట్‌ను జాతీయరహదారి మీదుగా కడపలోని సిమెంట్ ఫ్యాక్టరీకి తరలించే దగ్గర చిక్కొచ్చింది. దీంతో మిథున్‌రెడ్డి పెద్ద స్కెచ్ వేశారు. బమిడికలొద్దు లేటరైట్ క్వారీకి అతి సమీపంలో రౌతులపూడి ఉండడంతో క్వారీ నుంచి జల్దాం వరకు రహదారిని నిర్మించి అక్కడి నుంచి కత్తిపూడి హైవే మీదుగా కడపకు లేటరైట్ తరలింపునకు స్కెచ్ వేశారు. ఈ మేరకు చెల్లూరు-బమిడికలొద్దు మధ్య ఉన్న ఐదు కిలోమీటర్ల పరిధిలో ఉన్న రిజర్వ్‌ఫారెస్ట్‌ను అటవీశాఖ అనుమతుల్లేకుండా తవ్విపారేశారు. ఇక్కడి నుంచి కడపలో భారతి సిమెంట్‌కు లేటరైట్ తరలించేశారు.

ఉమ్మడి జిల్లాతో మిథున్‌రెడ్డికి సంబంధం

వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత 2022లో కడప జిల్లా రాజంపేట ఎంపీగా ఉన్న పీవీ మిథున్‌రెడ్డిని అప్పటి సీఎం జగన్ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కోఆర్డినేటర్‌గా నియమించారు. అప్పటి నుంచీ మిథున్‌రెడ్డి జిల్లాలో చెలరేగిపోయారు. జగన్ మెప్పుకోసం.. జగన్ ఆర్థిక ప్రయోజనాల కోసం అడ్డంగా బరితెగించేశారు. కలెక్టర్లు, ఎస్పీలుగా ఎవరుండాలో ఆయనే డిసైడ్ చేసేవారు. అయితే అప్పటికే జగన్ ప్రభుత్వం తెచ్చిన మద్యం పాలసీలో మిథున్‌రెడ్డి కీలకంగా మారారు. మద్యం ముడుపులు ఎక్కడి నుంచి ఎక్కడికి వెళ్లాలి? ఏబ్రాండ్‌లను అనుమతించాలి? వంటివన్నీ మిథున్‌రెడ్డి చక్కబెట్టారు. పెద్దాపురం మండలం చినబ్రహ్మదేవంలోని కేబీకే బయోటెక్ నుంచి స్పిరిట్ కొనుగోలులోనూ చక్రం తిప్పినట్టు సమాచారం. ప్రభుత్వం మారాక గతేడాది మద్యం కుంభకోణానికి సంబంధించి సీఐడీ జరిపిన సోదాల్లో చినబ్రహ్మదేవంలోని కేబీకే బయోటెక్ కంపెనీ కూడా ఉంది. డిస్టిలరీల లెక్కలు, కేబీకే నుంచి వెళ్లిన సరుకు లెక్కల్లో వ్యత్యాసాలపై ఆరా తీసింది. తాజాగా ఈ కుంభకోణంలో మిథున్‌రెడ్డి పాత్ర బయటపడడంతో అరెస్టయి రాజమండ్రి సెంట్రల్ జైలుపాలయ్యారు.

సెంట్రల్ జైలులో ఎంపీ మిథున్‌రెడ్డి

లిక్కర్‌స్కామ్‌లో ఏ4, వైసీపీ ఎంపీ పెదిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డికి రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీ నంబర్ 4196 కేటాయించారు. సెంట్రల్ జైల్ సూపరింటెండెంట్ రాహుల్ కథనం ప్రకారం ఆదివారం రాత్రి 8:50 గంటలకు నిందితుడిని జైలులోకి తీసుకున్నారు. అతన్ని స్నేహ బ్లాక్ బ్యారక్‌లో ఉంచారు.

- కన్నేస్తే ఖాళీ కావాల్సిందే
- నాడు ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్
- ఐదేళ్లూ దందాలు.. దౌర్జన్యాలే
- ఎన్నికల్లో మద్యం, డబ్బు డంపింగ్
- నకిలీ మద్యం నిల్వలు
- లేటరైట్.. అక్రమాలు
- పేదల ఇళ్ల స్థలాల చదును
- కేబీకే బయోటెక్‌లో హస్తం
- లిక్కర్ స్కాంలో జైలుపాలు
- మిథున్‌రెడ్డి అరాచకాలెన్నెన్నో..

ఎన్నికల్లో.. డబ్బు..మందు...

ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ హోదాలో మిథున్ రెడ్డి గత ఎన్నికల్లో టీడీపీని ఓడించడానికి మద్యం, అక్రమ సొమ్ము వందల కోట్లలో ఇక్కడ డంప్ చేశారు. ఈమేరకు అప్పటి ఎమ్మెల్యే ద్వారంపూడితో స్కెచ్ వేశారు. పిఠాపురంలో పవన్‌ను ఓడించడానికి మిథున్‌రెడ్డి కొన్ని రోజులు జిల్లాలోనే మకాం వేశారు. కడప నుంచి నకిలీ మద్యాన్ని వ్యాన్లలో తరలించారు. ఒక్క పిఠాపురానికి కోట్లలో నకిలీ మద్యం డంప్ చేశారు. పోటీ తీవ్రంగా ఉన్న నియోజకవర్గాలకు రూ.30 కోట్లు, కోట్ల విలువైన మద్యం మిథున్‌రెడ్డి కనుసన్నల్లోనే పంపిణీ జరిగింది. ఈ మందు పలుచోట్ల జిల్లాల్లో పట్టుబడింది. ఈ బాటిళ్లు అత్యంత నాసిరకంగా తేల్చారు.

సెజ్‌లు..పోర్టు..

పదివేల ఎకరాల విస్తీర్ణంలో ఉన్న కాకినాడ సెజ్ దేశంలోనే పెద్దది. ఇందులో 51 శాతం జీఎమ్మార్, కాకినాడ డీప్ వాటర్‌పోర్టు నిర్వహణదారుడైన కేవీరావుకు 0.29 శాతం, ఆయనకే చెందిన కాకినాడ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ హోల్డింగ్స్ ప్రైవేట్ లిమిటెడ్(కేఐహెచ్‌పీఎల్)కు 33.75 శాతం వాటాలున్నాయి. వీటన్నింటిపై జగన్ కన్నేయగా, మిథున్‌రెడ్డి రంగంలోకి దిగి వైవీ.విక్రాంత్‌రెడ్డితో కలిపి స్కెచ్ వేశారు. కేవీ రావును బెదిరించి వాటా రాయించేసుకున్నారు. కాకినాడ సీపోర్టు (డీప్‌వాటర్‌పోర్టు)పైనా జగన్ కన్నేయడంతో మిథున్‌రెడ్డి బెదిరించి 41.12శాతం వాటాను కేవీ రావు జగన్ చెప్పిన అరబిందోకు విక్రయించారు.



కలెక్టర్‌కు రూ.లక్ష చెక్కు ఇస్తున్న నాగేశ్వరరావు.. రూ.50వేలు చెక్కు ఇస్తున్న కృష్ణ వెంకటసాయి

ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ, ఉమెన్ హాకీ పోటీలకు స్పాన్సర్లు ముందుకు రావాలి : కలెక్టర్

కలెక్టరేట్ (కాకినాడ), జూలై 21 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెలలో జరిగే ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ, జాతీయ జూనియర్ ఉమెన్ హాకీ చాంపియన్‌షిప్ పోటీలకు స్పాన్సర్లు ముందుకు రావాలని కలెక్టర్ షాన్‌మోహన్ పిలుపునిచ్చారు. పరిశ్రమలు, స్వచ్ఛంద సంస్థలు, వ్యాపార సంస్థలు, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, కార్పొరేట్ ఆసుపత్రులు, ఆసక్తిగలవారు తమ వంతు సహకారం అందించాలన్నారు. ఆగస్టు ఒకటి నుంచి 12వ తేదీ వరకు జాతీయ జూనియర్ మహిళల చాంపియన్‌షిప్ జరుగుతుందన్నారు. కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో ఆగస్టు 3 నుంచి 20వ తేదీ వరకు ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. అభ్యర్థులకు, క్రీడాకారులకు అల్పాహారం, భోజనం, వసతి, ఇతర సదుపాయాలు కల్పించేందుకు, ధన, వస్తు, ఆహారం రూపంలో సహకారం అందించేందుకు పరిశ్రమల యజమానులు, వ్యాపారులు ముందుకు రావాలని కోరారు.

ముందుకొచ్చిన స్పాన్సర్లు

ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ, ఉమెన్స్ హాకీ టోర్నమెంట్‌లకు కాకినాడకు చెందిన కేవీఎస్ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు కృష్ణ వెంకటసాయి రూ.50వేలు, శ్రీఅగస్త్య ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ నాగేశ్వరరావు రూ.లక్ష విరాళాలను చెక్కుల రూపంలో కలెక్టర్ షాన్‌మోహన్‌కు అందజేశారు. వారిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో డీఆర్వో వెంకట్రావు, కలెక్టరేట్ పరిపాలనాధికారి రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



అర్జీని పరిశీలిస్తున్న ఎస్పీ బిందుమాధవ్

సమస్యలు స్థానికంగా పరిష్కారం కావాలి : ఎస్పీ

పోలీస్ పీజీఆర్ఎస్‌కు 73 మంది అర్జీలు

కాకినాడ క్రైం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత సమస్యలతో బాధపడుతూ పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు అవి స్థానికంగానే పరిష్కారం కావాలని ఎస్పీ జి.బిందుమాధవ్ అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ఎస్పీ గ్రీవెన్స్‌కు జిల్లావ్యాప్తంగా 73 మంది అర్జీదారులు వచ్చారు. అర్జీదారుల సమక్షంలోనే ఎస్పీ సంబంధిత పోలీస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి అర్జీదారుల ఫిర్యాదులు సమ్మతమైనవైతే వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి వేగవంతంగా దర్యాప్తు పూర్తిచేసి సాధ్యమైనంత త్వరితగతిన సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లా పోలీస్ కార్యాలయానికి రాలేని ఫిర్యాదుదారులు, ఎస్ఐ, సీఐ, డీఎస్పీ కార్యాలయాల్లో ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఆ ఫిర్యాదులను పోలీస్ గ్రీవెన్స్‌గానే పరిగణిస్తామని తెలిపారు.

పచ్చిరొట్ట ఎరువుతో మట్టికి జీవం : కలెక్టర్

కలెక్టరేట్ (కాకినాడ), జూలై 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రైతులు పచ్చిరొట్ట ఎరువును ఉపయోగించడం ద్వారా మట్టికి జీవం లభిస్తుందని కలెక్టర్ షాన్ మోహన్ పేర్కొన్నారు. జీవన ఎరువుల వినియోగంతో పంటలకు ఎలాంటి లాభం చేకూరుతుందో వివరించే పోస్టర్‌ను సోమవారం ఆయన కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రసాయన ఎరువుల వినియోగం తగ్గించి పచ్చిరొట్ట ఎరువులు, జీవన ఎరువులు వినియోగించడంతో రైతులకు సాగు వ్యయం 25 శాతం తగ్గుతుందన్నారు. దీనివల్ల నేల సారం పెరిగి పోషకాల లభ్యత పెరుగుతుందన్నారు. జీవన ఎరువులు వినియోగించడం ద్వారా ఎరువులను ఆదా చేయవచ్చన్నారు. జీవన ఎరువులు వినియోగించిన రైతులు తమ అనుభవాల్ని వివరించగా, వారిని కలెక్టర్ అభినందించారు. అనంతరం రైతులకు అజోస్పైరిల్లం, ఫాస్ఫరస్ కరిగించే ఎరువులు, పొటాష్‌ను కరిగించే ఎరువులను కలెక్టర్ అందజేశారు. వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకుడు విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆసుపత్రుల్లో ధరల పట్టిక ప్రదర్శించాలి : డీఎంహెచ్‌వో

జీజీహెచ్ (కాకినాడ), జూలై 21 (ఆంధ్రజ్యోతి) జిల్లాలో ప్రభుత్వ అనుమతి పొందిన అన్ని ప్రైవేట్ ఆసుపత్రులు, క్లినిక్స్, డయాగ్నొస్టిక్ సెంటర్లు, ల్యాబ్‌లు నిర్వహించే యాజమాన్యం ఆంధ్రప్రదేశ్ అల్లోపతిక్ ప్రైవేట్ మెడికల్ కేర్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం- 2002 రూల్ నెం.9 ప్రకారం అన్ని రకాల వైద్య సేవల ధరల పట్టికను ఇంగ్లీష్, తెలుగు భాషల్లో రిసెప్షన్ కౌంటర్లో ప్రదర్శించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ పేర్కొన్నారు. వాటి ఫొటోలను ఈనెల 31వ తేదీలోగా డీఎంహెచ్‌వో కార్యాలయ మెయిల్ ఐడీ statisticalofficerkakinada@gmail.comకు విధిగా పంపాలని డీఎంహెచ్‌వో ఆదేశించారు.





శరణు.. శరణు.. శాకంబరీ..

కాకినాడ సూర్యరావుపేటలోని బాలాత్రిపుర సుందరి ఆలయంలో సోమవారం అమ్మవారిని శాకంబరిగా అలంకరించారు. ఈ సందర్భంలో కూరగాయలు, ఆకుకూరలతో ఆలయాన్ని ప్రత్యేకంగా తీర్చిదిద్దిన దృశ్యం..

6

కలెక్టరేట్‌లో ప్లాస్టిక్ బాటిళ్ల నిషేధం



కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన సమావేశంలో దర్శనమిచ్చిన స్టీల్ బాటిళ్లు

అధికారిక కార్యక్రమాల్లో దర్శనమిస్తున్న స్టీల్ బాటిళ్లు

అమలవుతున్న కలెక్టర్ ఆదేశాలు

కలెక్టరేట్ (కాకినాడ), జూలై21(ఆంధ్రజ్యోతి): కాకినాడ కలెక్టరేట్‌లో ప్లాస్టిక్ బాటిల్స్‌ను నిషేధించారు. దీంతో ఇక్కడ జరిగే అధికారిక కార్యక్రమాల్లో స్టీల్ బాటిల్స్ దర్శనమిస్తున్నాయి. మంచినీరు తాగడానికి అందరూ వాటినే వినియోగిస్తున్నారు. స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛదివస్‌లో రాష్ట్రంలో భాగంగా ప్లాస్టిక్ నిషేధానికి శ్రీకారం చుట్టారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ షాన్‌మోహన్ కూడా కలెక్టరేట్‌లో ప్లాస్టిక్ బాటిళ్లను నిషేధించారు. స్టీల్ బాటిళ్లు మాత్రమే వినియోగించి పర్యావరణాన్ని పరిరక్షించాలని ఆదేశించారు. దీంతో కలెక్టరేట్‌లో జరిగే అధికారిక సమావేశాల్లో స్టీల్ బాటిళ్ల వినియోగం పెరిగింది. దీంతో కలెక్టరేట్‌కు వచ్చే అర్జీదారులు కూడా ఆశ్చర్యానికి గురవుతున్నారు. అంతేకాకుండా ప్లాస్టిక్ బాటిళ్లను వినియోగించవద్దని కలెక్టరేట్‌లో అధికంగా బోర్డులు ఏర్పాటుచేశారు. కలెక్టర్ షాన్‌మోహన్ నిర్ణయాన్ని పర్యావరణ పరిరక్షణవేత్తలు స్వాగతిస్తున్నారు. ఇదే విధంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో కూడా ప్లాస్టిక్ బాటిళ్లను నిషేధిస్తే పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుందని పలువురు పేర్కొంటున్నారు.

రైలు వెళుతున్నా.. వెళ్లిపోవచ్చు!



ఇక రైల్వే గేట్లు ఉండవ్

- భారంగా మారడంతో మూత
- ఫ్లయ్ ఓవర్లు, అండర్ పాస్‌లు
- రైల్వే శాఖ గ్రీన్ సిగ్నల్
- సామర్లకోట సెక్షన్‌లో నిర్మాణాలు
- రాజమండ్రి టూ హంసవరం
- భూ సేకరణకు ఆదేశాలు
- తీరనున్న వాహనదారుల ఇక్కట్లు

సామర్లకోట, జూలై 21(ఆంధ్రజ్యోతి): రైల్వే లెవెల్ క్రాస్ గేట్లు ఉండవు. వాటిని పూర్తిగా ఎత్తివేసి వాటి స్థానంలో వాహనాల రద్దీని బట్టి ఫ్లయ్ ఓవర్ బ్రిడ్జిలు, అండర్ పాసేజ్‌లు నిర్మించనున్నారు. వచ్చే ఏడాది నాటికి ఈ పనులు పూర్తికానున్నాయి. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో మొత్తం 1,075 రైల్వే గేట్లను గుర్తించి వీటిని మొత్తంగా తొలగించేందుకు సన్నద్ధం అవుతున్నారు. విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో విజయవాడ నుంచి దువ్వాడ వరకూ మొత్తం 198 రైల్వే గేట్లను గుర్తించారు. వీటి స్థానంలో తాజా ప్రతిపాదనల మేరకు 50 అండర్ పాసేజ్‌ల నిర్మాణానికి, 35 ఫ్లయ్ ఓవర్ బ్రిడ్జిల నిర్మాణాలకు రైల్వే గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సామర్లకోట నుంచి కాకినాడ పోర్టు వరకూ మరో ఐదు రైలు గేట్లు తొలగించేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. వీటి సంఖ్య ఇంకా పెరగనున్నట్టు రైల్వే ఉన్నతాధికారుల ద్వారా సమాచారం. ఈ మేరకు భూసేకరణ చేసి త్వరితగతిన స్థలాలు అప్పగించాలని జిల్లా కలెక్టరేట్‌కు ఆదేశాలు అందాయి. దీంతో సామర్లకోట రైల్వే ఇంజనీరింగ్ సెక్షన్ పరిధిలో రాజమహేంద్రవరం నుంచి హంసవరం వరకూ భూసేకరణలకు శ్రీకారం చుట్టారు. రైల్వే గేట్ల నిర్వహణ రైల్వే శాఖకు భారంగా మారింది. రైళ్ళ రాకపోకలు సాగించే సమయంలో గేట్లు వేయడంతో గంటల కొద్దీ సమయం వృథాతో పాటు సిబ్బంది జీతభత్యాలు, నిర్వహణ ఖర్చు ఎక్కువ. ఈ భారాన్ని తగ్గించుకోవడానికి లెవెల్ క్రాస్ గేట్లు పూర్తిగా ఎత్తివేయాలని రైల్వే శాఖ నిర్ణయం తీసుకుంది.



ఎక్కడెక్కడ ఫ్లయ్ ఓవర్లు

సామర్లకోట ఐదు తూముల సమీపాన ఉండూరు రోడ్డు నుంచి మునిసిపల్ కార్యాలయం వరకూ సుమారు కిలోమీటర్ పొడవునా 12 మీటర్ల వెడల్పున ఫ్లయ్ ఓవర్ బ్రిడ్జి నిర్మించనున్నారు.విజయవాడ-విశాఖ మెయిన్ లైన్‌లోని రెండు ట్రాక్‌లు, సామర్లకోట-కాకినాడ బ్రాంచిలైన్‌లో రెండు ట్రాక్‌లతో పాటు ఏలేరు కాలువ, పీబీసీ కాలువ మీదుగా రూ.100 కోట్ల వ్యయంతో ఫ్లయ్ ఓవర్ బ్రిడ్జిని నిర్మించనున్నారు. జి.మేడపాడు సమీపాన కెనాల్ రోడ్డులో శ్మశాన వాటిక నుంచి జి.మేడపాడు రైల్వే స్టేషన్ మీదుగా గోలివారి కొత్తూరు కూడలి ప్రాంతం వరకూ మరో ఫ్లయ్ ఓవర్ బ్రిడ్జిని రూ. 100 కోట్లతో నిర్మించనున్నారు. ఇది కూడా 12 మీటర్ల వెడల్పున ఉండేలా నిర్మించనున్నారు. పెదబ్రహ్మదేవం రైల్వేస్టేషన్ సమీపాన ప్రస్తుతం ఉన్న అండర్‌పాసేజ్‌ను మరింత విస్తరించే ప్రక్రియకు రైల్వే ఇంజనీరింగ్ ఉన్నతాధికారులు సమాలోచనలు చేస్తున్నారు. ఇక్కడ ఫ్లయ్ ఓవర్ బ్రిడ్జి నిర్మించే వీల్లేకపోవడంతో ఇప్పటికే ఉన్న అండర్‌పాసేజ్‌ను మరింత వెడల్పు చేసి నాలుగు చక్రాల వాహనాలు సైతం రాకపోకలు సాగించేలా ప్లాన్ రూపొందిస్తున్నారు. ఈ మేరకు రైల్వే శాఖ నిధులు ఖర్చు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ఇప్పటికే అంచనాలు సమర్పించింది. వీటితో పాటు మరికొన్ని ప్రాంతాల్లో సైతం ఫ్లయ్ ఓవర్ బ్రిడ్జిలు నిర్మించనున్నట్టు సమాచారం.

భూసేకరణకు సంసిద్ధం

ప్రస్తుతం అండర్ పాసేజ్ నిర్మాణాలకు సంబంధించిన ఫైళ్ళు కాకినాడ ఆర్డీవో కార్యాలయానికి చేరుకున్నాయి. రావికంపాడు, అన్నవరం, హంసవరం, తుని తదితర ప్రాంతాలకు చెంది భూసేకరణ చేపట్టేందుకు పెద్దాపురం ఆర్డీవో కార్యాలయానికి ఫైళ్లు చేరుకున్నాయి. దీంతో అధికారులు నవంబరు నాటికి భూసేకరణ పూర్తి చేసి రైల్వే శాఖకు అప్పగించనున్నారు. మొత్తం ప్రక్రియ పూర్తయితే వచ్చే ఏడాది నాటికి లెవెల్ క్రాస్ గేట్లు లేని వ్యవస్థగా రైల్వే శాఖ మారనుంది.




డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఎదురుచూపులు తప్పట్లేదు. తీవ్ర తర్జనభర్జనల అనంతరం డిగ్రీ కళాశాల్లో అడ్మిషన్లకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఇందుకు సంబంధించి పలు నిబంధనలను సవరిస్తూ జీవో జారీ చేసింది. ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్ లోనూ ప్రవేశం కోసం దరఖాస్తు చేసే అవకాశాన్ని కల్పించింది. కానీ ఇప్పటి వరకు అడ్మిషన్ల ప్రక్రియలో కీలకమైన ఓఏఎండీసీ వెబ్‌సైట్ (పోర్టల్) అప్డేట్ కాకపోగా, వెబ్ ఆప్షన్లు కూడా ఓపెన్ కాలేదు. ప్రభుత్వం జీవో ఇచ్చి ఆరు రోజులు దాటినా ఇంతవరకు ఏపీ ఉన్నత విద్యా మండలి నుంచి మార్గదర్శకాలు, ప్రవేశాల షెడ్యూల్ రాకపోవడంపై విద్యా శాఖ వర్గాల్లోనే అసహనం వ్యక్తమవుతోంది.

గ్రీన్ సిగ్నల్

- డిగ్రీ అడ్మిషన్లకు ప్రభుత్వం అనుమతి
- ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించే అవకాశం
- విద్యార్థుల ఆధార్ అథంటికేషన్ తప్పనిసరి
- అప్డేట్ కాని ఓఏఎండీసీ పోర్టల్
- ఓపెన్ కాని వెబ్ ఆప్షన్లు
- ప్రవేశాల షెడ్యూల్ కోసం విద్యార్థుల ఎదురుచూపులు
- ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసి ఆరు రోజులు
- ఉన్నత విద్యా మండలి నుంచి విడుదల కాని మార్గదర్శకాలు

(పిఠాపురం-ఆంధ్రజ్యోతి)

డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలపై ఉన్న సందిగ్ధత ఎట్టకేలకు తొలగింది. ఇంటర్మీడియట్ ఫలితాలు వచ్చిన మూడు నెలల అనంతరం ప్రవేశాలకు అనుమతి ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రవేశాలను ఆన్‌లైన్‌లో లేదా ఆఫ్‌లైన్‌లో నిర్వహించాలనే విషయంలో తర్జనభర్జనల అనంతరం రెండు పద్ధతుల్లోనూ దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. ఎస్సీ వర్గీకరణ అనంతరం జరుగుతున్న ప్రవేశాలు కావడంతో వాటిపైనా క్లారిటీ ఇచ్చారు. ప్రభుత్వం జీవో జారీ చేసి ఆరు రోజులు దాటినా ఇప్పటిదాకా ఏపీ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హైయ్యర్ ఎడ్యుకేషన్ నుంచి మార్గదర్శకాలు, అడ్మిషన్ల షెడ్యూలు విడుదల కాకపోవడంతో విద్యార్థులకు ఎదురుచూపులు తప్పడం లేదు. దరఖాస్తులు ఆన్‌లైన్ చేసే ఓఏఎండీసీ వెబ్‌సైట్ ఇంకా అప్డేట్ కాలేదు. ఇంకా 2024-25 అడ్మిషన్లకు సంబంధించిన షెడ్యూల్‌నే చూపిస్తోంది.



AP OAMDC -2024 -25 ADMISSIONS
(ONLINE ADMISSIONS MODULE FOR DEGREE COLLEGES)
ADMISSIONS INTO DEGREE PROGREMMES - WEB BASED COUNSELLING
HOME
LOGIN
NEW Note: Oriental College special form registrations are enabled
STEP-1 Fill Application & Fee Payment
STEP-2 Print Application
STEP-3 Web Options
STEP-4 Download Allotment Order
Forms
Print Application
Important Information
NEW Detailed Notification
NEW Institute Profile
NEW G.O.Ms.No.34
NEW Circular for reuploading pending certificates 2024-25
NEW Circular on Cancellation and Sliding of Admissions for
Important Dates
Re-uploading the pending admissions will be enabled from: 25-10-2024 to 26-10-2024

ఓఏఎండీసీ పోర్టల్‌లో ఇంకా 2024-25 అడ్మిషన్ల ప్రక్రియనే చూపిస్తున్న దృశ్యం

అన్ని వర్గాలతో చర్చించి...

కాకినాడ జిల్లాలో కాకినాడ నగరంతో పాటు పిఠాపురం, తుని, ఏలేశ్వరం, జగ్గంపేట, పెరుమాళ్లపురం, పెద్దాపురంల్లో ప్రభుత్వ, ఎయిడెడ్ కళాశాలలు ఉన్నాయి. వీటికి దాదాపు మూడు రెట్లు అదనంగా ప్రైవేటు కాలేజీలు ఉన్నాయి. వీటిల్లో 20వేలకు పైగా సీట్లు ఉన్నాయి. తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లోనూ ఇదే స్థాయిలో కళాశాలలు ఉన్నాయి. వైసీపీ తీసుకువచ్చిన అడ్మిషన్ల ప్రక్రియ గందరగోళంగా ఉండడంతో దీనిలో మార్పు చేయాలని కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిర్ణయం తీసుకుంది. దీనిపై ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు, విద్యావేత్తలతో చర్చించింది. ఆన్‌లైన్ ప్రక్రియను కొనసాగిస్తూనే పాత పద్ధతిలో కళాశాలల్లో ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించే విధానం అమలు చేయాలని ఎక్కువ మంది సూచించారు. దీంతో దీనిని ఖరారు చేస్తూ రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ కార్యదర్శి కోన శశిధర్ జీవో నెం.45 జారీ చేశారు.

అదే విధంగా డిగ్రీలో ప్రస్తుతం ఉన్న సింగిల్ సబ్జెక్టు విధానంలో స్వల్ప మార్పులతో పాత విధానాన్నే కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఆర్ట్స్, సైన్స్, సోషల్ సైన్స్, కామర్స్, మేనేజ్‌మెంట్, కంప్యూటర్ అప్లికేషన్స్, సోషల్ వర్క్ తదితర కోర్సుల్లో డిగ్రీలు, హానర్స్ డిగ్రీలో ప్రవేశాలకు ఆంధ్రప్రదేశ్ డిగ్రీ కాలేజెస్ ఆన్‌లైన్ అడ్మిషన్ రూల్స్-2020లో సవరణలు చేస్తూ ఉత్తర్వులిచ్చారు. దీని ప్రకారం ఆయా కోర్సుల్లో డిగ్రీ చేసేందుకు (బీఏ, బీకాం, బీఎస్సీ) ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు ఓఏఎండీసీ పోర్టల్ ద్వారా తమ దరఖాస్తులను సమర్పించాల్సి ఉంటుంది. ఇందులోనే తమకు నచ్చిన కళాశాల, కోర్సును ఆర్డర్ ఆఫ్ ప్రిఫరెన్స్‌లో ఎంచుకునే అవకాశం కల్పించారు. లేకుంటే తమకు అందుబాటులో ఉండే (లేదా) నచ్చిన కళాశాలలో విద్యార్థులు నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తులను ఆయా డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లు తీసుకుని విద్యార్థులకు రసీదు ఇవ్వడంతో పాటు ఓఏఎండీసీ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి. రెండు విధానాల్లోనూ దరఖాస్తుకు ఆధార్ అథంటికేషన్ తప్పనిసరి చేశారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో విద్యార్థి దరఖాస్తు చేసుకుంటే స్వయంగా కళాశాలలో ఇచ్చిన అప్లికేషన్‌లోని ఆప్షన్లనే పరిగణలోకి తీసుకుంటారు.

ఉత్తర్వులిచ్చి ఆరు రోజులైనా...

డిగ్రీ ప్రవేశాలకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చి ఐదు రోజులు దాటింది. ఇప్పటి వరకు ఏపీ ఉన్నత విద్యా మండలి నుంచి ప్రవేశాల షెడ్యూల్, మార్గదర్శకాలు మాత్రం విడుదల కాలేదు. కనీసం దరఖాస్తులు ఆన్‌లైన్‌లో సమర్పించే ఓఏఎండీసీ పోర్టల్‌ను ఇప్పటిదాకా అప్డేట్ చేయలేదు. అందులో ఇంకా 2024-25 అడ్మిషన్ల ప్రక్రియ, అప్పటి నోటిఫికేషన్లనే చూపిస్తోంది. ప్రతిరోజూ ఈ పోర్టల్‌ను తనిఖీ చేసుకుంటున్న విద్యార్థులకు నిరాశే మిగులుతోంది.

త్వరితగతిన పూర్తి చేయాలి

ఇంటర్ పరీక్షా ఫలితాలు వచ్చి మూడు నెలలు దాటినందున డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయడంపై ప్రభుత్వం దృష్టి సారించాలని విద్యావేత్తలు కోరుతున్నారు. మూడు, నాలుగు వారాలు లోపుగానే దరఖాస్తులు, వెబ్ ఆప్షన్ల స్వీకరణ, అలాట్‌మెంట్ పూర్తయితే విద్యా సంవత్సరాన్ని త్వరగా ప్రారంభించే వీలుంటుందని వారు చెప్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం జీవో ఇచ్చినా మార్గదర్శకాలు, అడ్మిషన్ షెడ్యూల్ ఇవ్వడానికి ఏపీ ఉన్నత విద్యా మండలి ఇంత సమయం తీసుకోవడం సరికాదంటున్నారు. కాగా రెండు, మూడు రోజుల్లో ప్రవేశాల షెడ్యూల్ ఇవ్వడంతో పాటు వెబ్ ఆప్షన్లు ఓపెన్ అవుతాయని భావిస్తున్నామని ఉన్నత విద్యా శాఖకు చెందిన ఉన్నతాధికారి ఒకరు చెప్పారు.

ఐదేళ్లలో ఎన్ని చమురు నిల్వలు కనుగొన్నారు?



బీజేపీ రాష్ట్రాధ్యక్షుడు మాధవ్‌తో సతీష్‌బాబు

కాకినాడ సిటీ, జూలై 21 (ఆంధ్రజ్యోతి): పెట్రోలియం, సహజవాయువులపై సోమవారం జరిగిన పార్లమెంట్ సమావేశంలో రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు పలు ప్రశ్నలు వేశారు. గత ఐదేళ్లలో కనుగొన్న చమురు, గ్యాస్ నిల్వలపై ప్రభుత్వం ఏమైనా అధ్యయనాలు, పరిశోధనలు చేసిందా, అలాగే గత ఐదేళ్లలో రాష్ట్రాలవారీగా ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో చేపట్టిన అన్వేషణ ప్రాజెక్టులు వివరాలు తెలపాలని కోరారు. ప్రాంతాలవారీగా కనుగొన్న నిల్వల పరిమాణం, వాటి వినియోగానికి తీసుకున్న చర్యలు వెల్లడించాలన్నారు. ఈ ప్రాజెక్టులకు వినియోగించిన మొత్తం నిధులు, బేసిన్ ఎంపిక, వాణిజ్య సాధ్యత మూల్యాంకనం, పర్యావరణ అంచనాలపై అనుసరించే ప్రమాణాలు తెలియజేయాలన్నారు. అలాగే మిషన్ అన్వేషణ్ స్థితి, పెట్టుబడులు ఆకర్షించడానికి సాంకేతిక బదిలీని ప్రోత్సహించడానికి, వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలను విస్తరించడానికి తీసుకున్న చర్యలు ఏమిటో తెలపాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. అలాగే ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ కింద సేకరించిన మొత్తం నిధులు, కాకినాడతో పాటుగా జిల్లాల వారీగా తెలపాలన్నారు. ఈ ప్రశ్నలకు కేంద్ర పెట్రోలియం, సహజవాయువుల శాఖ మంత్రి సురేష్ గోపి సమాధానమిచ్చారు. ఆంధ్రప్రదేశ్‌తో సహా దేశంలో చమురు, గ్యాస్ నిల్వలను అంచనా వేయడానికి వివిధ సర్వేలు జరుగుతున్నాయన్నారు. వివిధ పాలసీల కింద కేంద్ర ప్రభుత్వం మొత్తం 112 బ్లాక్‌లను మంజూరు చేసిందన్నారు. ఈ బ్లాక్‌లను పొందిన ఆపరేటర్లు గత ఐదేళ్లలో 101 అన్వేషణ బావులను తవ్వారని స్పష్టం చేశారు. ఈ కార్యకలాపాల నిర్వహణ కోసం రూ.4,448 కోట్లు ఖర్చు చేశారని తెలిపారు. అలాగే కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ కాకినాడ జిల్లాలో మినరల్, రెవెన్యూ జనరేషన్‌లో లేటరైట్స్‌కి రూ.36.86 కోట్లు ఆదాయం వచ్చినట్టు పేర్కొన్నారు. ఈ వివరాలను ఎంపీ సతీష్‌బాబు క్యాంపు కార్యాలయం నుంచి విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు.

పెట్రోలియం, సహజవాయువులపై పార్లమెంట్‌లో సతీష్‌బాబు ప్రశ్నలు

బీజేపీ రాష్ట్రాధ్యక్షుడిని కలిసిన సానా

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీ మాధవ్‌ను సోమవారం ఢిల్లీలోని పార్లమెంట్ భవన్‌లో రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వీరిద్దరూ కొద్దిసేపు భేటీ అయ్యారు.



స్వల్పంగా పెరుగుతున్న నీటి మట్టం

స్వల్పంగా పెరిగిన వరద

ధవళేశ్వరం, జూలై 21(ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలు వల్ల వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తూ గోదావరిలో కలుస్తుండడంతో ధవళేశ్వరం వద్ద గోదావరికి వరద స్వల్పంగా పెరిగింది. కాటన్ బ్యారేజ్ నుంచి 64,663 క్యూసెక్కులు సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. డెల్టా పరిధిలో కురుస్తున్న వర్షాలు వల్ల కాలువలకు సాగునీటి విడుదల తగ్గించారు. తూర్పుడెల్టాకు 3800క్యూసెక్కులు, మధ్యడెల్టాకు 2300క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 4700క్యూసెక్కులు చొప్పున సాగునీటిని విడుదల చేస్తున్నారు. భద్రాచలం వద్ద నీటి మట్టం స్వల్పంగా పెరిగి 13.70 అడుగులుగా నమోదయింది.

ద్రాక్షారామలో ముగిసిన సప్తసప్తాహం



పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహిస్తున్న పండితులు

ద్రాక్షారామ, జూలై 21(ఆంధ్రజ్యోతి): బీఆర్ అంబేద్కర్ జిల్లా ద్రాక్షారామ భీమేశ్వరాలయ బాహ్యప్రాంగణంలో వేంచేసియున్న ప్రసన్నాంజనేయ స్వామి సన్నిధిలో జూన్ 2 నుంచి నిర్వహిస్తున్న సప్తసప్తాహం సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా పూర్ణాహుతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సీతారాముల శాంతి కల్యాణం, సామ్రాజ్య పట్టాభిషేకం జరిపారు. అనంతరం అన్నసమారాధాన జరిగింది. సాయంత్రం ఉష్ట్ర వాహనంపై స్వామివారి నగరోత్సవం వైభవంగా నిర్వహించారు. ఒంటె ప్రదర్శన, కోలాట నృత్యాలు, బ్యాండు వాయిద్యాలు, చింతూరు గిరిజన ఆదివాసీ నృత్యప్రదర్శన, కేరళ వాయిద్యాలతో నగరోత్సవం జరిగింది. రాత్రి త్రిరత్నాల పేరిట రంగస్థల నాటికలు ప్రదర్శించారు. పూర్ణాహుతి కార్యక్రమంలో ప్రసన్నాంజనేయ బాలభక్త సమాజం అధ్యక్షుడు బోనం శ్రీనివాస్ దంపతులు పాల్గొన్నారు. కార్యక్రమంలో బాలభక్త సమాజం సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

యోగాసన పోటీల్లో యూసీఈకే విద్యార్థుల ప్రతిభ



విజేతలను అభినందిస్తున్న జేఎన్టీయూకే వీసీ సీఎస్ఆర్కే ప్రసాద్

జేఎన్టీయూకే, జూలై 21 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూలో నిర్వహించిన జిల్లా స్థాయి యోగాసన పోటీల్లో యూసీఈకే విద్యార్థులు ప్రతిభ కనబరిచి ఆగస్టులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు పీఆర్వో ఆర్.శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. పెట్రోలియం ఇంజనీరింగ్ విద్యార్థి కె.అభిరామ్ ఆర్టిస్టిక్ సోలో, ట్విస్టింగ్ బాడీ ఇండివిడ్యువల్ విభాగాల్లో ప్రథమ స్థానంలో నిలిచాడు. మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థినులు గీతాసంజన, శైలజ ఆర్టిస్ట్ ఫెయిర్ విభాగంలో మొదటి స్థానం సాధించారు. విద్యార్థులను, వారికి శిక్షణనిచ్చిన డాక్టర్ చంద్ర సుధాదేవిని జేఎన్టీయూకే వీసీ సీఎస్ఆర్కే ప్రసాద్ అభినందించారు.

వందే భారత్‌కు సామర్లకోటలో హాల్ట్ పొడిగింపు



సామర్లకోట, జూలై 21(ఆంధ్రజ్యోతి): సామర్లకోట మీదుగా అటు విశాఖ ఇటు సికింద్రాబాద్‌లకు రాకపోకలు సాగిస్తున్న వందేభారత్ సూపర్ ఫాస్ట్‌ఎక్స్‌ప్రెస్‌కు సామర్లకోటలో హాల్ట్‌ను మరో ఆరు నెలలు పెంచుతూ రైల్వే సీనియర్ డీవోఎం కార్యాలయం నుంచి సోమవారం రాత్రి ఉత్తర్వులు సామర్లకోట రైల్వే అధికారులకు అందాయి. గతంలో జారీ చేసిన హాల్ట్ ఉత్తర్వులను మరో ఆరునెలలు పొడిగించారు. ఈ ఉత్తర్వులు ఆగస్టు 2 నుంచి అమలులోకి రానుంది.

- 20833 నెంబరు గల విశాఖ నుంచి సికింద్రాబాద్ వెళ్లే ఎక్స్‌ప్రెస్ సామర్లకోటకు ఉదయం 7.26 గంటలకు చేరుకుని రాజమహేంద్రవరం నకు 8.00 గంటలకు చేరుతుంది
- 20834 నెంబరు గల సికింద్రాబాద్ నుంచి విశాఖ వెళ్లే వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రాజమహేంద్రవరంనకు రాత్రి 8.43 నిముషాలకు చేరుతుంది. సామర్లకోటకు రాత్రి 9.23 చేరుతుంది. ఈ రైలులో ప్రయాణించే ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు రిజర్వేషన్ టిక్కెట్లు పొందగోరే వారు వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు హాల్ట్ ఉన్న స్టేషన్‌లలోని బుకింగ్ కార్యాలయాలలో సంప్రదించాలని రైల్వే సూపరింటెండెంట్ ఎం.రమేష్ సోమవారం రాత్రి తెలిపారు.

చెయ్యేరు సొసైటీ అధ్యక్షుడిగా శ్రీనివాస్ ప్రమాణస్వీకారం



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బుచ్చిబాబు

కాట్రేనికోన, జూలై 21(ఆంధ్రజ్యోతి): కాట్రేనికోన మండలం చెయ్యేరు సొసైటీ అధ్యక్షుడిగా త్సవటపల్లి శ్రీనివాస్‌తో పాటు డైరెక్టర్లుగా గుబ్బల రమేష్, పెయ్యల ముత్యాలరావు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రమాణస్వీకారం చేసిన అనంతరం చైర్మన్ శ్రీనివాస్ మాట్లాడారు. సంఘ సభ్యులు, రైతుల మద్దతుతో చెయ్యేరు సొసైటీని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకం ఉంచి కీలక బాధ్యతలను అప్పగించిన ఎమ్మెల్యే సుబ్బరాజుకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీనివాస్ నాయకత్వ పటిమ సంఘాభివృద్ధికి తోడ్పడుతుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, నాగిడి నాగేశ్వరరావు, ఆకాశం శ్రీనివాస్, త్సవటపల్లి నాగేంద్ర, ఏఎంసీ చైర్మన్ ఓగూరి భాగ్యశ్రీ, మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, చెల్లి అశోక్, గుత్తుల సాయి, గంధం పళ్ళంరాజు, గొలకోటి వెంకటరెడ్డి, కల్వకొలను తాతాజీ, త్సవటపల్లి నాగభూషణం, సర్పంచ్ చెల్లి సురేష్, నంద్యాల వెంకటేశ్వరరావు, టీటీవీ నారాయణస్వామి, నంద్యాల చంటి, ఎంపీటీసీ గుత్తుల సూర్య మహాలక్ష్మి, నడింపల్లి సుబ్బరాజు, చింతపల్లి అజయ్‌కుమార్, సలాది నానాజీ, పాల్గొన్నారు.



పిఠాపురంలో శాకంబరిగా దర్శనమిచ్చిన పురుహూతికా అమ్మవారు

శరణు... శరణు...

శాకంబరీ

చల్లగా చూడు తల్లీ అంటూ ఆషాఢంలో ప్రత్యేక అలంకరణలు

ఆషాఢంలో అమ్మవార్ల జాతరలు మొదలవుతాయి. ఈ మాసంలో అమ్మవార్ల ఆశీస్సులు తీసుకుంటారు. మొక్కులు చెల్లించుకుంటారు. ఏటా ఈ మాసం రాగానే పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారి ఆలయాలను సందర్శిస్తారు. కాకినాడ జిల్లాలోని తలుపులమ్మ లోవ, మరిడమ్మ జాతరలతో పాటు పలు ప్రముఖ ఆలయాలు, చిన్న ఆలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అలంకరణలు చేస్తారు. అమ్మవార్లు శాకం బరిగా దర్శనమిస్తారు. రకరకాల పండ్లు, కూరగాయలు, ఆకుకూరలతో అలంకరించి పూజిస్తారు. ఇలా చేయడం వల్ల సర్వసుఖాలు, విజయాలు, కోరికలు నెరవేరుతామయని భక్తుల నమ్మకం.



కాకినాడలో శాకంబరి అలంకరణలో బాలాత్రిపురసుందరి అమ్మవారు

(కాకినాడ/సామర్లకోట-ఆంధ్రజ్యోతి)

ఆషాఢ మాసంలో అమ్మవార్లను కూరగాయలతో అలంకరించే సంప్రదాయం శాకంబరీదేవి ఉత్సవాల్లో భాగం. శాకంబరి అంటే కూరగాయల తల్లి అని అర్థం. ఒకసారి కరువు వచ్చినప్పుడు ప్రజల బాధను చూసి చలించిన అమ్మవారు తనను తాను శాకంబరిగా మార్చుకుని అనేక రకాల కూరగాయలు, పండ్లు, ఆకుకూరలు సృష్టించి ప్రజలను కరువు నుంచి కాపాడినట్టు పురాణాలు చెప్తున్నాయి. అప్పట్నుంచీ అమ్మవారిని శాకంబరిగా పూజించే సంప్రదాయం మొదలైందని పండితులు చెప్తున్నారు. ఆషాఢంలో అమ్మవారిని కూరగాయలతో అలంకరించడం వల్ల, పంటలు బాగా పండి, ప్రజలకు ఆహార కొరత లేకుండా ఉంటుందని భక్తుల విశ్వాసం. ఈ మాసంలో మహిమాన్విత రూపంలో ఉండే అమ్మవారిని దర్శించుకోవడం వల్ల అన్ని కోర్కెలు నెరవేరుతాయని భక్తుల ప్రగాఢ నమ్మకం. అందుకే వివిధ రకాల కూరగాయలు, పండ్లు, ఆకుకూరలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈ అలంకరణలో అమ్మవారిని ఆహార పదార్థాలకు అధిదేవతగా ఆరాధిస్తారు. పౌర్ణమి వంటి దివ్య తిథుల్లో జరిగే ఉత్సవాలు, కైంకర్యాలు, పూజలతో పాటు ఆషాఢ మాసంలో అమ్మవారికి కూరగాయల అలంకరణను భక్తులే వారి చేతులతో స్వయంగా చేస్తారు.

ముందుగానే విగ్రహాల సైజులను బట్టి కూరగాయల దండలు తయారు చేస్తారు. ఆలయం మొత్తాన్ని కూరగాయలు, పండ్లు, ఆకు కూరలతో అలంకరించడం ఆనవాయితీగా మారింది. తోటకూర, గోంగూర, వేపాకు, కరివేపాకు, మామిడాకులు వంటి ఆకులతో పాటు, అమ్మవారి మెడలో ధగధగ మెరిసేలా కలర్‌ఫుల్ క్యారెట్, బీట్‌రూట్, బంగాళా దుంపలు, వంకాయలు, బెండకాయలు... ఇలా రకరకాల కూరగాయలతో పాటు ప్రస్తుత సీజన్లో లభించే పైనాపిల్, కర్బూజా దానిమ్మ, బత్తాయి... ఇలా అనేక రకాల పండ్లతో ఆలయాన్ని అందంగా అలంకరిస్తారు. ఒకప్పుడు పెద్ద పెద్ద ప్రముఖ ఆలయాల్లో మాత్రమే కనిపించే ఈ అలంకరణ సంప్రదాయం ప్రస్తుతం వీధుల్లోని చిన్న ఆలయాలకు సైతం చేరింది. క్వింటాళ్లలో కూరగాయలు కొనుగోలు చేసి మరీ అలంకరిస్తున్నారు.

ఆషాఢ మాసంలో శాకంబరీ దేవికి సారె కూడా సమర్పిస్తుంటారు. వర్షాలు కురిసి, పంటలు బాగా పండి, ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని కృతజ్ఞతాపూర్వకంగా రైతులు పిండి వంటలు, పండ్లు, స్వీట్లతో అమ్మవారికి సారె సమర్పిస్తారని పండితులు, ఆచార సంప్రదాయాలు తెలిసిన పెద్దలు చెప్తున్నారు.



కాకినాడలో బాలాత్రిపురసుందరి అమ్మవారి ఆలయాన్ని కూరగాయలతో తీర్చిదిద్దిన దృశ్యం

మోతుగూడెంలో అఖండ-2 సినిమా సందడి



సీలేరు నది తీరాన డ్రోన్ కెమెరాతో ట్రైలర్ షూటింగ్ చేస్తున్న డైరెక్టర్ బోయపాటి శీను



మోతుగూడెం, జూలై 21(ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెం పరివాహక ప్రాంతాల్లో ఐదు రోజులు అఖండ-2 సినిమా చిత్రీకరణ జరగనుంది.అఖండ సినిమాకు దేశవ్యాప్తంగా వచ్చిన క్రేజ్‌తో అఖండ-2పై భారీ అంచనాలు ఉన్న నేపథ్యంలో దర్శకుడు బోయపాటి శీను సినిమా విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.బాలకృష్ణ కుమార్తె తేజస్విని సమర్పణలో నిర్మాతలు రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మిస్తున్న అఖండ-2 చిత్రీకరణలో భాగంగా మోతుగూడెంలో బోయపాటి శ్రీను, చిత్ర బృందం కొన్ని సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. ఏజెన్సీలో దట్టమైన అడవుల్లో, ఆంధ్ర, ఒడిస్సా సరిహద్దులో, మోతుగూడెం గ్రామంలోని సీలేరు నది పరివాహక ప్రాంతాలైన ధారాలమ్మ ఆలయ వెనుక సీలేరు నది, పొల్లూరు జలపాతం వద్ద చిత్రీకరణ ప్రారంభించారు. అగ్ర కథానాయకుడు బాలకృష్ణపై ఐదు రోజులపాటు కొన్ని సన్నివేశాలు చిత్రీకరించనున్నారు. ఈ సినిమా సెప్టెంబరు 25న విడుదల చేస్తామని దర్శకుడు బోయపాటి తెలిపారు.

చంద్రకుమార్‌కు గ్రేట్ క్రియేటివ్ ఆర్టిస్టు అవార్డు



అమలాపురం రూరల్, జూలై 21(ఆంధ్రజ్యోతి): క్రియేటివ్ హార్ట్స్ అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ సంస్థ అధినేత ఆకొండి అంజి ఆధ్వర్యంలో సింధూర్-సెల్యూట్ ఇండియన్ సోల్జర్స్ అనే అంశంపై జాతీయస్థాయిలో చిత్రకళా పోటీలు నిర్వహించారు. 15 రాష్ట్రాల నుంచి 250 మంది చిత్రకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. పాలగుమ్మి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చిత్రలేఖన ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న పోలిశెట్టి నరసింహ చంద్రకుమార్ గీసిన ఆపరేషన్ సింధూర్ చిత్రానికి గ్రేట్ క్రియేటివ్ ఆర్టిస్టు అవార్డు లభించింది. వింగ్ కమాండర్ వ్యోమికాసింగ్ (వైమానిక దళం), కల్నల్ సోఫియా ఖురేషి(ఆర్మీ) చిత్రాన్ని వాటర్ కలర్స్ ఉపయోగించి ఆయన గీసారు. ఈ సందర్భంగా చంద్రకుమార్‌ను పలువురు అభినందించారు.

◄ చంద్రకుమార్ గీసిన ఆపరేషన్ సిందూర్ చిత్రం

వైద్యం కోసం విజయవాడ వెళ్తుంటే..
లారీ ఢీకొని ఇద్దరి మృతి

కృష్ణా జిల్లా హనుమాన్ జంక్షన్ సమీపంలో ఘటన

తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం పల్లంట్లలో విషాదఛాయలు


రాఘవ (ఫైల్)


మృతిచెందిన పసలపూడి రాఘవ, యల్లమిల్లి భాస్కరరావు

దేవరపల్లి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): లా రీ ఢీకొన్న సంఘటనలో ఇద్దరు మృతిచెందారు. వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం పల్లంట్ల గ్రామానికి చెందిన పసలపూడి రాఘవ (25), తన బావ యల్లమిల్లి భాస్కరరావు(50)తో కలిసి సోమవారం విజయవాడ పయనమయ్యారు. తాడేపల్లిగూడెం మండలం జమ్మికృష్ణంపాలెనికి చెందిన భాస్కరరావు గత కొంతకాలంగా పక్షవాతంతో బాధపడుతున్నాడు. దీంతో వైద్యం నిమిత్తం వారిద్దరు పల్లంట్ల నుంచి విజయవాడ ఆసుపత్రికి మోటర్‌సైకిల్‌పై వెళ్తుండగా కృష్ణా జిల్లా హనుమాన్ జంక్షన్ సమీపంలోని పాములపాడు వద్ద లారీ ఢీకొంది. దీంతో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. రాఘవ పెయింటర్‌గా పనిచేస్తున్నాడని కుటుంబసభ్యులు తెలిపారు. ఇద్దరి మృతితో పల్లంట్ల గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

మంచినీరు అడిగి..
మహిళ మెడలో పుస్తెలతాడు లాక్కుని పరారీ

మామిడికుదురు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం పాశర్లపూడి గ్రామంలో మహిళ మెడలో పుస్తెలతాడు లాక్కుని దుండగుడు పరారైన సంఘటన ఆదివారం రాత్రి జరిగింది. నగరం ఎస్ఐ చైతన్యకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పాశర్లపూడి గ్రామానికి చెందిన వలవల వరలక్ష్మి ఇంటికి గుర్తుతెలియని వ్యక్తి వచ్చి తాగేందుకు మంచినీరు కావాలని అడిగాడు. నీటిని తీసుకెళ్లి కొంతసేపటి తరువాత మళ్లీ వచ్చి మీ సెల్‌ఫోన్ ఇవ్వమని అడగడంతో ఆమె నిరాకరించింది. దీంతో అతడు మహిళ గొంతును పట్టుకునేందుకు ప్రయత్నించగా కేకలు వేయడానికి ప్రయత్నించగా బెదిరించి నోరు నొక్కి, మెడలోని రెండున్నర కాసుల పుస్తెల తాడును తెంచుకుని మోటారు సైకిల్‌పై పారిపోయాడు. దీనిపై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చైతన్యకుమార్ పేర్కొన్నారు.

దారి కాచి దొంగతనం

- ఎనిమిది మంది అరెస్టు
- నిందితుల్లో నలుగురు మైనర్లు
- మూడు మోటార్‌సైకిళ్లు, సెల్‌ఫోన్ స్వాధీనం



బిక్కవోలు పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ విద్య, అనపర్తి సీఐ సుమంత్

బిక్కవోలు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో దారి కాచి దొంగతనం చేసిన ఎనిమిది మందిని అరెస్టు చేసినట్టు డీఎస్పీ బి.విద్య తెలిపారు. సోమవారం తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ, అనపర్తి సీఐ సుమంత్ విలేకర్ల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఊలపల్లికి చెందిన కరుపోతు వరప్రసాద్ గోకవరం ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 17న అర్ధరాత్రి విధులు ముగించుకుని బైక్‌పై ఇంటికి వస్తుండగా బలభద్రపురం ఫ్లైఓవర్ బ్రిడ్జిపైకి వచ్చేసరికి రాజానగరం వైపు 3 బైక్‌లపై వెళ్తున్న ఎనిమిది మంది అడ్డగించి భయభ్రాంతులకు గురి చేసి అతడి వద్ద ఉన్న రూ.1550 నగదు, సెల్‌ఫోన్ లాక్కుని పోయారు. దీంతో వరప్రసాద్ 112కు ఫోన్ చేయగా బిక్కవోలు పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి అతడి నుంచి ఫిర్యాదు తీసుకుని కేసు నమోదు చేశారు. దీంతో సీఐ సుమంత్, ఎస్ఐ రవిచంద్రకుమార్, సిబ్బందితో దర్యాప్తు జరిపి ఎనిమిది మంది నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారని డీఎస్పీ తెలిపారు. రిమాండ్‌కు పంపిన వారిలో బిక్కవోలు మండలం ఊలపల్లికి చెందిన బదిరెడ్డి శ్రీసాయి, ఖండవిల్లి సాయి, రాయవరం మండలం వెదురుపాక సావరం గ్రామానికి చెందిన మేడిశెట్టి కుమార్, కురుపూడి అభిలాష్, నలుగురు బాల నేరస్తులు ఉన్నారని చెప్పారు. నిందితుల నుంచి మూడు మోటార్‌సైకిళ్లు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారని వివరించారు.

గంజాయితో ఏడుగురి అరెస్ట్

5 కిలోల గంజాయితో పాటు రూ.3 వేల నగదు, 5 సెల్‌ఫోన్లు స్వాధీనం


నిడదవోలు పోలీస్ స్టేషన్‌లో కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ జగన్మోహనరావు

నిడదవోలు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు జగనన్న కాలనీలో గంజాయితో ఏడుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి 5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ కె.జగన్మోహనరావు తెలిపారు. ఆదివారం రాత్రి సీఐ పీవీజీ తిలక్ ఆదేశాలతో తమకు వచ్చిన సమాచారంతో దాడి చేశామన్నారు. జగనన్న కాలనీకి చెందిన వెలిచర్ల నాగరాజు, ఉజ్జినవారి వీధికి చెందిన చవాన్ పండు, కాకివారి వీధికి చెందిన కాకి కార్తీక్, ఎన్టీఆర్ కాలనీకి చెందిన నక్కల రసీల్, శాంతినగర్‌కు చెందిన మహ్మద్ దస్తగిరి అలియాస్ సమీర్, ఉజ్జినవారి వీధికి చెందిన గేదెల హేమంత్ నాగదుర్గ, చర్చిపేటకు చెందిన దూలపల్లి రాజేష్ కుమార్‌ను అరెస్ట్ చేశామన్నారు. వారి నుంచి స్వాధీనం చేసుకున్న 5 కిలోల గంజాయి సుమారు రూ.40వేలు ఉంటుందని, అలాగే రూ.3 వేల నగదు, 5 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. రాజమండ్రి హుకుంపేటకు చెందిన పసుపులేటి కీర్తన వద్ద గంజాయిని కొనుగోలు చేసి వారంతా కాలేజీల వద్ద 50 గ్రాములు రూ.500 రూపాయిల చొప్పున విక్రయిస్తుంటారని పేర్కొన్నారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

మద్యం దుకాణంలో రూ.3.5 లక్షల నగదు చోరీ

మండపేట, జూలై 21(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం ఏడిద దుళ్లరోడ్డులో ఉన్న మద్యం దుకాణంలో ఆదివారం అర్ధరాత్రి దొంగలు పడి రూ.3.5లక్షల నగదుతో పాటు దుకాణంలో ఉన్న సీసీ కెమెరా హార్డ్‌డిస్క్‌ను చోరీ చేశారు. సోమవారం ఉదయం దుకాణం నిర్వాహకులు తెరిచేందుకువెళ్లగా చోరీ జరిగినట్టు గుర్తించారు. సంఘటనా ప్రదేశాన్ని రామచంద్రపురం ట్రైనీ డీఎస్పీ ప్రదీప్తి, రూరల్ సీఐ దొరరాజు, ఎస్ఐ కిషోర్, క్లూస్‌టీం పరిశీలించారు. జరిగిన సంఘటనపై యాజమాని నుంచి ఆరాతీశారు. యాజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఆగస్టు 1న నాలుగు రాష్ట్రాల మాదిగ న్యాయవాదులతో ప్రత్యేక సమావేశం

అన్నవరం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మాదిగలకు రిజర్వేషన్ కల్పిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు ఏడాది పూర్తవుతున్న నేపథ్యంలో ఆగస్టు 1న తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి మాదిగ న్యాయవాదులతో ప్రత్యేక సమావేశం నిర్వహించడం జరుగుతుందని మాదిగ న్యాయవాదుల ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు వీవీ.రత్నం పేర్కొన్నారు. సోమవారం కాకినాడ జిల్లా అన్నవరంలో సత్యదేవుడిని దర్శించుకున్న ఆయన కొండదిగువున మీడియా సమావేశం నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆరోగ్యం బాగుండాలని పూజలు నిర్వహించామన్నారు. రాజమహేంద్రవరం సమావేశంలో సుమారు 4వేలమంది మాదిగ న్యాయవాదుల సమక్షంలో వారికి ఘనసన్మానం నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్క మాదిగ న్యాయవాది ఈ కార్యక్రమానికి తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కిలాడి దయానందరావు, పలివెల సతీష్, కొత్తపల్లి ప్రసాదరావు, జయరాజ్, కొండేపూడి ఉదయ్‌కుమార్ ఉన్నారు.


అన్నవరం సమావేశంలో మాట్లాడుతున్న వీవీ రత్నం

మోడల్ ప్రాథమిక పాఠశాలల్లో...
మౌలిక సదుపాయాల పరిశీలనకు కమిటీలు

తొండంగి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మోడల్ ప్రాథమిక పాఠశాలల్లో మౌలిక సదుపాయాల పరిశీలనకు ప్రభుత్వం కమిటీలను ఏర్పాటు చేసింది. ఈ మేరకు మండల విద్యాకేంద్రాలకు సర్క్యులర్ అందింది. దీని ప్రకారం ఎంఈవో, క్లస్టర్ హెచ్ఎం, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఆ గ్రామ ఇంజినీరింగ్ అసిస్టెంట్ సభ్యులుగా గల బృందాలు పాఠశాలలను సందర్శించనున్నాయి. గతంలో మోడల్ ప్రాథమిక పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం ఇంజీరింగ్ అసిస్టెంట్లు ఇన్‌పుట్ డేటా షీటు అప్ లోడ్ చేశారు. దీనిని అనుసరించి కమిటీ సభ్యులు అక్కడి అవసరాలను గుర్తించి నివేదికను సమర్పించవలసి ఉంది. క్లాస్ రూమ్ పార్టిషన్, వరండాను క్లాస్ రూంగా మార్చడం, గ్రీన్‌చాక్ బోర్డుల ఇండెంట్, కాంప్లెక్స్ పరిధిలో ఉన్న ఇతర పాఠశాలల్లో మిగులు ఫర్నీచర్ తదితర వస్తువులను అవసరం ఉన్న పాఠశాలలకు సమకూర్చడం తదితర అంశాలు కమిటీ పరిశీలిస్తుంది. మండలంలో ఎంఈవో 1, 2ల ఆధ్వర్యంలో రెండు కమిటీలు పాఠశాలలను పరిశీలించి నివేదిక అందించాలని విద్యాశాఖ ఆదేశించింది.

అరుణాచలేశ్వరునికి
విశిష్ట అభిషేకాలు

ప్రత్తిపాడు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం రాచపల్లి అడ్డురోడ్డు వద్ద ఉన్న అపీత కుచాంబ అరుణాచలేశ్వరునికి సోమవారం అభిషేకాలు, విశిష్టపూజలు నిర్వహించారు. పంచామృతాలతో గంధం, వివిధ రకాల పండ్ల రసాలతో అరుణాచలేశ్వరునికిఅభిషేకాలు చేశారు.


అభిషేక దృశ్యం

రూ.1.5 కోట్ల విలువైన స్థలం స్వాధీనం


ఎడ్యుకేషనల్ ట్రస్టు స్థలం స్వాధీనం చేసుకున్న అధికారులు

ట్రిబ్యునల్ ఆదేశాలతో దేవదాయశాఖ అధికారుల చర్యలు

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూలై 21 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా రామచంద్రపురం కృత్తివెంటి పేర్రాజుపంతులు ఎడ్యుకేషనల్ ట్రస్టుకు చెందిన రూ.1.5 కోట్ల విలువైన 45 సెంట్ల స్థలాన్ని సోమవారం దేవదాయశాఖ అధికారు లు స్వాధీనం చేసుకున్నారు. రామచంద్రపురం ద్రాక్షారామ మెయిన్‌రోడ్డు పక్కన ఉన్న కృత్తివెంటి పేర్రాజు పంతులు ఎడ్యుకేషన్ ట్రస్టుకు చెందిన 45 సెంట్ల స్థలంలో ప్రయివేటు వ్యక్తులు సామిల్లు నిర్వహిస్తున్నారు. గతంలో జిల్లా పరిషత్‌కు లీజు చెల్లించేవారు. తదుపరి దేవదాయ శాఖకు జెడ్పీ నుంచి ఆస్తులు బదిలీఅయిన తరువాత కొంత కాలంపాటు పేర్రాజుపంతులు ఎడ్యుకేషన్ ట్రస్టుకు లీజు చెల్లించారు. తదుపరి ఎటువంటి లీజు చెల్లించకపోవడంతో ఎడ్యుకేషనల్ ట్రస్టు ఈవో దేవదాయశాఖ ట్రిబునల్‌ను ఆశ్రయించారు. 45 సెంట్ల స్థలం కృత్తివెంటి పేర్రాజు పంతులు ఎడ్యుకేషనల్ ట్రస్టుకు స్వాధీనం చేయాలని ట్రిబ్యునల్ ఆదేశాలు ఇచ్చింది. ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు సోమవారం జిల్లా దేవదాయశాఖ అధికారి వి.సత్యనారాయణ పర్యవేక్షణలో దేవదాయశాఖ డివిజన్ తనిఖీదారు బాలాజీరామ్ ప్రసాద్ ఆధ్వర్యంలో ఈవో ఎస్.సత్యనారాయణ ఆలయ సిబ్బంది స్థలంలో ప్రవేశించి స్వా ధీనం చేసుకున్నారు. ముందుగా నోటీసు ఇచ్చిన ప్రకారం ఆక్రమణదారులు దేవదాయశాఖ అధికారులకు స్థలాన్ని అప్పగించారు. ఖాళీ స్థలంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. సత్యనారాయణ ఆదేశాల మేరకు స్థలానికి ఇనప కంచె ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో దేవదాయశాఖ పరిధిలో వివిధ ఆలయాల ఈవోలు జొన్నాడ భీమశంకరం, యాళ్లవీరవెంకట సత్యనారాయణ, వి.బాలకృష్ణ, వి.శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు ముద్రగడ తరలింపు
యశోద ఆసుపత్రిలో అడ్మిట్ చేసిన కుటుంబసభ్యులు


కిర్లంపూడిలో ముద్రగడ స్వగృహం నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్న కుటుంబీకులు

కిర్లంపూడి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మూత్రపిండాల సమస్యతో మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం రెండు రోజులుగా కాకినాడ మెడికవర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మెరుగైన వైద్యం కోసం కుటుంబీకులు హైదరాబాద్ తీసుకెళ్లి హైటెక్ సిటీలోని యశోద ఆసుపత్రిలో అడ్మిట్ చేశారు. సోమవారం ఆయన్ను మెడికవర్ ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేయగా వైద్యుల పర్యవేక్షణలో స్వగ్రామమైన కాకినాడ జిల్లా కిర్లంపూడికి తీసుకువచ్చారు. ముద్రగడ సతీమణి పద్మావతి, కుటుంబీకులు ఆయన్ను చూసి కలవరపడ్డారు. ముద్రగడను ఇంట్లో కొద్దిసేపు ఉంచి వెంటనే అంబులెన్స్ ద్వారా హైదరాబాద్‌కు తరలించారు. మాజీ మంత్రి తోట నరసింహం, జగ్గంపేట జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్, ముద్రగడ అభిమానులు ముద్రగడ స్వగృహానికి చేరుకున్నారు. ఎవరూ అధైర్యపడవద్దని, ముద్రగడ ఆరోగ్యంగా ఉన్నారని మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలిస్తున్నామని ఆయన కుమారుడు గిరిబాబు చెప్పారు.

ఐదు ఆసుపత్రులు తిప్పినా దక్కని శిశువు ప్రాణం
అల్లూరి జిల్లా ఓకుర్తిలో ఘటన

రాజవొమ్మంగి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యానికి గురైన శిశువుకు మెరుగైన వైద్యం అందించేందుకు ఐదు ఆసుపత్రులు తిప్పి చివరకు కాకినాడ జీజీహెచ్‌కు తీసుకువెళ్లినా ప్రాణం పోయిన ఘటన అల్లూరి జిల్లా రాజవొమ్మంగి మండలంలో జరిగింది. మండలంలోని వాతంగి పంచాయతి ఓకుర్తి గ్రామానికి చెందిన గళ్ళెల సరోజ ఏప్రిల్‌లో మగబిడ్డకు జన్మనిచ్చింది. ఆ బిడ్డ జూలై 18న అనారోగ్యానికి గురికావడంతో జడ్డంగి పీహెచ్‌సీ, అక్కడ నుంచి మెరుగైన వైద్యానికి అడ్డతీగల సీహెచ్‌సీ, రంపచోడవరం ఏరియా ఆసుపత్రి, రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి చివరకు కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు. కాగా ఆ బిడ్డ 19న రాత్రి మరణించినట్లు కుటుంబీకులు తెలిపారు. దీనిపై ఇన్‌చార్జి సీడీపీవో దేవమణిని వివరణ కోరగా అంగన్‌వాడీ వర్కర్ వివరాలు తెలిపారని, అయితే స్పష్టత లేదని చెప్పడం గమనార్హం.

తల్లీ, కుమార్తెల అదృశ్యంపై కేసు

కొవ్వూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): తల్లికుమార్తెల అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు మహిళా హెడ్ కానిస్టేబుల్ లలితకుమారి తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు పట్టణానికి చెందిన మర్రి ఈశ్వరి, ఏడాదిన్నర కుమార్తెను తీసుకుని జూన్ నెలలో ఏలేశ్వరం అత్తగారింటి నుంచి కొవ్వూరు వచ్చింది. వారం రోజుల తరువాత ఏలేశ్వరం వెళ్లింది. అప్పటి నుంచి భర్త, అమ్మతో ఫోన్ మాట్లాడుతుంది. ఇటీవల తల్లి గుడిదాటి దివ్య కూతురు, మనుమరాలిని చూడడానికి వస్తున్నానని తెలపడంతో ఏలేశ్వరం వెళ్లలేదని తెలిసింది. దీంతో దివ్య పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా హెడ్ కానిస్టేబుల్ కేసు నమోదు చేశారు.

గోదావరిలో గల్లంతైన ఇంజనీరింగ్ విద్యార్థి మృతదేహం లభ్యం


దినేష్ మృతదేహం

ఆత్రేయపురం, జూలై 21(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీవేంకటేశ్వర స్వామి దర్శనానికి వచ్చి గౌతమి గోదావరి నదిలో శనివారం ఉదయం 5 గంటల సమయంలో స్నానం ఆచరిస్తుండగా ఖమ్మం జిల్లాకు చెందిన ఇంజనీరింగ్ విద్యార్థి పామర్తి దినేష్(22) గల్లంతయ్యాడు. శనివారం నుంచి సోమవారం వరకూ గాలింపు చర్యలు చేపట్టారు. ఆలయ ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు, సీఐ విద్యాసాగర్, తహశీల్దార్ రాజేశ్వరరావు గాలింపు చర్యల్లో నిమగ్నమయ్యారు. జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్, ఫైర్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందం, పోలీస్, గజ ఈతగాళ్లతో 3 బృందాలుగా విడిపోయి 30 మం ది గాలింపు చేపట్టారు. సోమవారం మధ్యాహ్నం ముక్తేశ్వరం- కోటిపల్లి ఫెర్రి సమీపంలో దినేష్ మృతదేహం లభ్యమైంది. శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం కొత్తపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎఎస్ఐ శ్రీనివాస్ పేర్కొన్నారు.

పూడ్చిపెట్టిన మృతదేహం వెలికితీత

తండ్రి మృతిపై కుమారుడి అనుమానం

కోనసీమ జిల్లా ఇప్పనపాడులో శవాన్ని పరిశీలించిన పోలీసులు


ఇప్పనపాడులో మృతదేహాన్ని బయటకు తీసి పరిశీలిస్తున్న పోలీసులు

మండపేట, జూలై 21 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఇప్పనపాడు పంచాయతీ పరిధిలోగల ఎర్రదిబ్బలకాలనీకి చెందిన వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. దీంతో పూడ్చిపెట్టిన శవాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం వైద్యులకు సిఫార్సు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఇప్పనపాడుకి చెందిన వాకాడ వీర్రాజు(47) ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేసేవాడు. అతడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. వారికి వివాహాలు అయ్యాయి. వీర్రాజు కుమార్తె భర్తతో గొడవల కారణంగా తల్లితండ్రుల వద్ద ఉంటోంది. ఈనెల 17న వీర్రాజు భార్యతో గొడవపడ్డాడు. ఆ మరుసటి రోజు గుండెపోటుతో తన భర్త మరణించాడని ఆమె భార్య చుట్టుపక్కల వారిని నమ్మించే ప్రయత్నం చేసింది. కుమార్తె కూడా వీర్రాజు గుండెపోటుతో మరణించాడని చెప్పడంతో అంత్యక్రియలు నిర్వహించారు. వీర్రాజు కుమారుడు వచ్చిన తర్వాత తన తల్లి ఫోన్ సంభాషణ విని తండ్రి మరణానికి తల్లి, సోదరే కారణమని అనుమానం కలిగింది. దీంతో మండపేట రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశా డు. ఈ నేపథ్యంలో సోమవారం శవాన్ని వెలికి తీసి మండపేట రూరల్ సీఐ దొర్రాజు, మండపేట తహశీల్దార్ తేజేశ్వరరావు, పోలీసులు, వైద్యుల సమక్షంలో పరిశీలించారు. మృతదేహంపై గాయాలు ఉన్నట్టు గుర్తించారు. పోస్టుమార్టం రిపోర్ట్ వస్తే కాని ఏమీ చెప్పలేమని పోలీసులు తెలిపారు. నిద్రిస్తున్న వీర్రాజును హత్యచేసి గుండెపోటుగా చిత్రీకరించే ప్రయత్నం జరిగిందని కుమారుడు ఆరోపించాడు.

సత్యదేవుడి సన్నిధిలో జగ్గయ్యపేట ఎమ్మెల్యే పూజలు


సత్యదేవుడి దర్శనానంతరం జగ్గయ్యపేట ఎమ్మెల్యే

అన్నవరం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో సోమవారం జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య కుటుంబసభ్యులతో స్వామిని దర్శించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ ఈవో సుబ్బారావు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వారికి వేదాశీర్వచనాలు అందజేశారు. లలిత రైస్ ఇండస్ట్రీస్ మేనేజింగ్ డైరక్టర్లు నిర్మించిన ప్రసాదం తయారీభవనం, ఉచిత కల్యాణమండపాలను పరిశీలించారు. ఎగ్జిక్యూటీవ్ డైరక్టర్ మట్టే ఆదిత్య కృష్ణ తదితరులున్నారు.

మరిడమ్మ జాతరకు పోటెత్తిన భక్తులు

రూ.37.84 లక్షల ఆదాయం

పెద్దాపురం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం మరిడమ్మ జాతరకు ఆది, సోమవారాల్లో భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే క్యూలైన్లలో బారులు తీరారు. సుమారు 35వేలమంది అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారని దేవస్థానం సహాయ కమిషనరు కురం విజయలక్ష్మి తెలిపారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచు కుని ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పలు స్వచ్ఛంద సంస్థలు భక్తులకు మంచినీరు, చంటి పిల్లలకు పాలు, పులిహోర ప్రసాదం పంపిణీ చేశాయి. మరిడమ్మ హుండీల్లో కానుకలను దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో సోమవారం లెక్కించారు. 34 రోజులకు రూ.37,84, 015 ఆదాయం వచ్చిందని విజయలక్ష్మి తెలిపారు. లెక్కింపులో సిబ్బంది రమణ, క్రాంతివీర్ తదితరులు పాల్గొన్నారు.


మరిడమ్మ హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

రైలు ఢీకొని మేకల కాపరి మృతి


మాధవరావు (ఫైల్)

తునిరూరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని-గుల్లిపాడు రైల్వే స్టేషన్ల మధ్యలో సోమవారం రైలు ఢీకొని మేకల కాపరి మృతిచెందాడు. మృతుడు అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం సీతారామపురం గ్రామానికి చెందిన పక్కుర్తి చిన్నమాధవరావు(58)గా గుర్తించామని రైల్వే పోలీసులు తెలిపారు. మేకలను తోలుకెళ్తుండగా కొన్ని మేకలు రైల్వే ట్రాక్ పైకి వెళ్లడంతో వాటిని తరిమే క్రమంలో రైలు ఢీకొని మాధవరావు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించి శవపంచనామా అనంతరం సంబంధికులకు అప్పగించినట్లు రైల్వే ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

ఫిట్స్‌తో పీక కోసుకున్న వ్యక్తి
చికిత్స పొందుతూ మృతి

కొవ్వూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): పీక కోసుకుని చికిత్స పొందుతూ వ్యక్తి మృతిచెందినట్టు కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె.శ్రీహరిరావు తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం గోవర్ధనగిరిమెట్టకు చెందిన కాంద్రుకోట చిన్ని గత కొంతకాలంగా ఫిట్స్‌తో బాధపడుతున్నాడు. ఫిట్స్ వచ్చినప్పుడు తనను గాయపర్చుకుంటూ, ఇతరులను గాయపరిచేవాడు. ఈనెల 19న ఇంటి వద్ద ఫిట్స్ రావడంతో చాకుతో పీక కోసుకున్నాడు. దీంతో చికిత్స నిమిత్తం కొవ్వూరు ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరం తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతిచెందాడు. ఈమేరకు అతడి భార్య సుబ్బలక్ష్మీ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

బైక్ ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలు

కొవ్వూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి): బైక్ ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలైనట్టు కొవ్వూరు పట్టణ ఏఎస్ఐ జి.శ్రీనివాస్ తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం వేములూరు గ్రామానికి చెందిన కొనగళ్ళ సూర్యచంద్రం టీవీఎస్ ఎక్స్ఎల్‌పై కొవ్వూరు వస్తుండగా ఎదురుగా బైక్ ఢీకొంది. రెండు వాహనాలపై ఉన్న ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం అక్కడి నుంచి కాకినాడ ఆసుపత్రికి తరలించారు. సూర్యచంద్రం కుమారుడు ప్రసాద్ ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు ఏఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

కందికుప్పలో విషజ్వరాలు
వైద్యశిబిరాలు ఏర్పాటు చేసిన అధికారులు

కాట్రేనికోన, జూలై 21(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం కందికుప్ప పంచాయతీ జమ్మిచెరువు కాలనీలో విషజ్వరాలు ప్రబలడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. కాళ్లు చేతులూ, శరీర కండరాలు మెలిపెడుతున్న నొప్పితో డెంగ్యూ, మలేరియా జ్వరాలుగా భావించి భయానక వాతావరణం నెలకొంది. గత వారం రోజులుగా విషజ్వరాలతో బాధపడుతున్న గ్రామస్తులు అమలాపురం ఏరియా ఆసుపత్రికి వెళ్లగా సరైన సౌకర్యాలు లేకపోవడంతో ముమ్మిడివరం ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వైద్య సిబ్బంది ముందు జాగ్రత్త చర్యగా గ్రామంలో ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేశారు. అవసరమైన మందులు అందిస్తున్నారు. దోమలతో పాటు ఇక్కడ మలేరియా, పచ్చకామెర్లు వంటి వ్యాధులు రావచ్చని ప్రజలు భయపడుతున్నారు. గత నాలుగు రోజులుగా కుళాయిల ద్వారా మట్టినీళ్లు వస్తున్నాయని అంటున్నారు. ఈ కలుషిత నీటి వల్ల డెంగ్యూ, మలేరియా, అతిసార, పచ్చకామెర్లు వంటి వ్యాధులు వ్యాప్తి చెందే ప్రమాదముందని ప్రజలు భయపడుతున్నారు.


కందికుప్పలో కలుషిత నీరు

నేటి నుంచి పిఠాపురంలో క్రికెట్ టోర్నమెంట్

పిఠాపురం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): కొణిదల వెంకట్రావు-అంజనాదేవి జనసేవా సంఘం ఆధ్వర్యంలో పిఠాపురంలోని ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ కళాశాల క్రీడా మైదానంలో మంగళవారం నుంచి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్టు వ్యవస్థాపక అధ్యక్షుడు కరణం సూరిబాబు తెలిపారు. విజేతలకు నగదు పురస్కారాలతో పాటు కప్‌లు అందజేస్తామని చెప్పారు.



మెరిట్ విద్యార్థులను సత్కరిస్తున్న చాగంటి కోటేశ్వరరావు

మెరిట్ విద్యార్థులకు సత్కారం

కాకినాడ సిటీ, జూలై 21 (ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన పలువురు విద్యార్థులను రాష్ట్ర ప్రభుత్వ నైతిక విలువల సలహాదారుడు డాక్టర్ చాగంటి కోటేశ్వరరావు సత్కరించారు. భరద్వాజ సేవా సంఘం అధ్యక్షుడు డాక్టర్ ఐవీ రావు అధ్యక్షతన ఆకొండ లక్ష్మి స్మారక గోశాల సమావేశ మందిరంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆరుగురు మెరిట్ విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.10 వేలు నగదు, ప్రశంసాపత్రాలు అందజేశారు. హైదరాబాద్ బ్రాహ్మణ గ్లోబల్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గిరిప్రసాద్‌వర్మ సమకూర్చిన కాలేజీ బ్యాగులు, పుస్తకాలను అందజేశారు.

కార్యక్రమంలో భరద్వాజ సేవా సంఘం కార్యదర్శి ముంజులూరి విశ్వేశ్వరరావు, కోశాధికారి రంగాభట్ల శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు డాక్టర్ వాడ్రేవు రవి, వద్దిపర్తి మురళి, కేవీఎస్ సీతారామ్, మండలీక వెంకటశాస్త్రి, అయ్యగారి వెంకటేష్, దంటు భాస్కరరావు, భారత్ వికాస్ పరిషత్ సభ్యులు ఆదిత్య శర్మ, వల్లూరి కామేశ్వరి, బాలాంత్రపు ప్రసాద్, చాగంటి సత్సంగ్ కమిటీ అధ్యక్షుడు సూర్యనారాయణ, కార్యదర్శి డీవీ రాజు, గోశాల ట్రస్టు చైర్మన్ డి.రామకృష్ణ, కోశాధికారి విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గౌరవాధ్యక్షుడు రంగారావు

సంప్రదాయ మత్స్యకార కులాల సంక్షేమ సంఘాల సమాఖ్య జిల్లా కార్యవర్గం ఎన్నిక

కాకినాడ సిటీ, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సంప్రదాయ మత్స్యకార కులాల సంక్షేమ సంఘాల సమాఖ్య కాకినాడ జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆర్ అండ్‌బీ అతిథిగృహంలో సోమవారం జరిగిన సమావేశంలో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు నడకుదుటి అర్జున్ సమక్షంలో జిల్లా కమిటీ ఎన్నిక జరిగింది. గౌరవ అధ్యక్షుడిగా జిల్లా మత్స్య సహకార సంఘాల అధ్యక్షుడు బలసాడి రంగారావు, అధ్యక్షుడిగా కోడా వెంకటరమణ, ఉపాధ్యక్షులుగా వాడ్రేవు వీరబాబు, మేడ అంద్రయ్య, జాన వెంకట్రావు, తుమ్మల కొండలరావు, ప్రధాన కార్యదర్శిగా పంతాడి రాజు, కోశాధికారిగా మడ్డి విజయ్‌కుమార్, కార్యనిర్వాహక కార్యదర్శిగా తుమ్మల సతీష్‌కుమార్, కార్యదర్శులుగా అరదాడి శివ, గంటా లక్ష్మణ్, పొట్టి పెదబాబు, తిరుమాని కుమారస్వామి, కార్యవర్గ సభ్యులు నియమితులయ్యారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల ముత్యాలు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల రమేష్, బొంది కాశీవిశ్వనాథం, రాష్ట్ర కోశాధికారి కాటా గోపి, రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు ప్రెసింగి ఆదినారాయణ, అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు చోడిపిల్లి దేముడు, కార్యదర్శి ఒలిశెట్టి అప్పలరాజు, మత్స్య సహకార సంఘాల ప్రతినిధులు, మత్స్యకార ఉప కులాల నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యక్షుడిగా వాడ్రేవు వీరబాబు



తాళ్లరేవు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): కోరింగ పంచాయతీ పెదబొడ్డు వెంకటాయపాలేనికి చెందిన వాడ్రేవు వీరబాబు సంప్రదాయ మత్స్యకారుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఆయనకు టీడీపీ తాళ్లరేవు మండల అధ్యక్షుడు టేకుమూడి లక్ష్మణరావు, పొన్నమండ రామలక్ష్మి, కొప్పిశెట్టి బాబీ, మందాల గంగసూర్యనారాయణ, జక్కల ప్రసాద్‌బాబు తదితరులు అభినందనలు తెలిపారు.

'కర్తవ్యంపై బాధ్యత కలిగి ఉండాలి'

పెద్దాపురం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు బాల్యం నుంచి కర్తవ్యం పట్ల బాధ్యత కలిగి ఉండాలని రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ వైడీ రామారావు పేర్కొన్నారు. స్థానిక శ్రీప్రకాష్ సినర్జీస్ పాఠశాలలో సోమవారం కర్తవ్య బాధ్యతలు అప్పగింత కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రామారావు మాట్లాడుతూ కర్తవ్య బాధ్యతలను అనుసరించి విద్యార్థి శక్తి సామర్థ్యాలను అంచనా వేయవచ్చన్నారు. పాఠశాల డైరెక్టర్ సీహెచ్ విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ విద్యార్థులు మంచి క్రమశిక్షణ, ధైర్యసాహసాలతో ఉండాలన్నారు. విద్యార్థులు చిన్నతనం నుంచే మంచి క్షమాగుణం కలిగి ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులు చోళ, మౌర్య, కాకతీయ, మరాఠా పేరుతో కవాతు నిర్వహించారు. సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్ మూర్తి, ఎంఆర్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు కర్తవ్య బాధ్యతలు అప్పగిస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ రామారావు



సామర్లకోట పట్టణంలో నీట మునిగిన రథం షెడ్డు సెంటరు రోడ్డు

సామర్లకోట, పిఠాపురం, గొల్లప్రోలుల్లో భారీ వర్షం

సామర్లకోట, జూలై 21 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట పట్టణం, మండలంలో సోమవారం భారీ వర్షం కురిసింది. పలు ప్రాంతాల్లో డ్రైన్లు, రోడ్లు ఏకమై ప్రవహించాయి. పట్టణంలోని అన్ని వార్డులలోనూ రెండు అడుగుల ఎత్తున వర్షపు నీరు చేరి ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలిగింది. స్టేషన్ సెంటర్, ఆర్టీసీ కాంప్లెక్స్, రథం షెడ్డు సెంటర్, మఠం సెంటర్, వీర్రాఘవపురం నెం.2 మార్కెట్, మున్సిపల్ కార్యాలయం రోడ్డు ప్రాంతాల్లో మురుగునీరు పెద్ద ఎత్తున రోడ్డు పైకి చేరింది. ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలోకి మురుగునీరు చేరడంతో ప్రయాణికులు లగేజీలతో బస్సులు ఎక్కేందుకు తీవ్ర ఇబ్బందిపడ్డారు.

కాయగూరలు, పత్తి పంటలకు జీవం

గొల్లప్రోలు రూరల్ (ఆంధ్రజ్యోతి): మెట్ట గ్రామాల్లో సోమవారం కురిసిన భారీ వర్షం పంటలకు జీవం పోసింది. గొల్లప్రోలు మండలం దుర్గాడ, ఎ.విజయనగరం, తాటిపర్తి, చినజగ్గంపేట, వన్నెపూడి, చెందుర్తి, కొడవలి తదితర గ్రామాల్లో భారీ వర్షం పడింది. కొద్ది రోజులుగా ఎండ తీవ్రతతో పత్తి, కాయగూరలు, మొక్కజొన్న తదితర పంటలు వేసిన పొలాలు ఎండిపోయే దశకు చేరుకున్నాయి. ఈ దశలో కురిసిన వర్షంతో పొలాల్లో తడి చేరింది. దీంతో పంటలకు మేలు జరిగిందని రైతులు తెలిపారు.

పిఠాపురం (ఆంధ్రజ్యోతి): పట్టణంలో సోమవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. దీంతో వాతావరణం చల్లబడింది. ప్రదాన రహదారులపై నీరు ప్రవహించింది. తదనంతరం ఎండ కాయడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు.

ఊరించి... నిరాశపరిచి...

కొత్తపల్లి (ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం మధ్యాహ్నం దట్టమైన మబ్బులు ఆవరిచాయి. కాసేపటికి చిరుజల్లులు పడ్డాయి. కుండపోత వర్షం కురుస్తుందని ఎదురు చూసిన ప్రజలకు నిరాశ ఎదురైంది. మూడు గంటల సమయంలో ఆకాశంలో మబ్బులు తొలగి ఎండ తీవ్రత కొనసాగింది.

'లయన్స్ ఎలైట్ ప్రజాహిత కార్యక్రమాలు అభినందనీయం'

కార్పొరేషన్ (కాకినాడ), జూలై 21 (ఆంధ్రజ్యోతి): లయన్స్ ఎలైట్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్మించిన రక్షిత నీటి ప్రాజెక్టును వివేకానంద పార్కులో కలెక్టర్ షాన్‌మోహన్ సోమవారం ప్రారంభించారు. లయన్స్ జోన్ చైర్‌పర్సన్, క్లబ్ పూర్వాధ్యక్షుడు మైలవరపు సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాహిత కార్యక్రమాల నిర్వహణలో లయన్స్ ఎలైట్ క్లబ్ ఎల్లప్పుడూ ముందుంటుందని కొనియాడారు. లయన్స్ ఎస్టేట్ గవర్నర్ వజ్రపు కోటేశ్వరరావు మాట్లాడుతూ ఈ ప్రాజెక్టు ఏర్పాటులో సత్యనారాయణ కృషి అభినందనీయమన్నారు. పూర్తి ఆటోమేటిక్ వాటర్ ప్రాజెక్టును దేవు శేషమాంబ స్పాన్సర్ చేశారని వివరిస్తూ ఆమెను కలెక్టర్ చేతులమీదుగా సత్కరించి ప్రత్యేక జ్ఞాపిక అందజేశారు. కందాలం రవీంద్రనాథ్, ముంజులూరి విశ్వేశ్వరరావు, పీడీసీ బాదం బాలకృష్ణ, లింగమల్లు కృష్ణమూర్తి, చిట్నీడి శ్రీనివాస్, గ్రంధి బాబ్జీ, వడ్డాది ఆదిత్య, నేదునూరి రామలింగేశ్వరశర్మ పాల్గొన్నారు.



రక్షిత నీటి ప్రాజెక్టును ప్రారంభిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్

నష్టపరిహారం కోసం మత్స్యకారుల ధర్నా

పిఠాపురం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఓఎన్జీసీ, ఫార్మా కంపెనీల వల్ల నష్టపోతున్న మత్స్యకారులకు నెలకు రూ.11,500 వంతున పరిహారం చెల్లించాలని, రూ.50లక్షలకు ఇన్సూరెన్స్ చేయించాలని, తీర ప్రాంత కంపెనీల్లో 20 శాతం ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మత్స్యకార సంఘాల ఐక్య వేదిక, మత్స్యకార కార్మిక సంఘం ఆధ్వర్యంలో పిఠాపురంలోని జనసేన కార్యాలయం వద్ద సోమవారం సాయంత్రం ధర్నా నిర్వహించారు. ముమ్మిడివరం నియోజకవర్గంతో పాటు యానాంలో ఇస్తున్న మాదిరిగానే కాకినాడ జిల్లాలోని మత్స్యకారులకు పరిహారం అందజేయాలని నాయకులు డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు కూటమి పార్టీల నేతలు ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరారు. కాగా తమను రమ్మని చెప్పి డిప్యూటీ సీఎం క్యాంపు కార్యాలయంలో జనసేన ఇన్‌చార్జి ఉండకుండా వెళ్లిపోవడంపై వారు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో అక్కడే బైఠాయించారు. కార్యాలయ సిబ్బంది వచ్చి వినతిపత్రం తీసుకున్నారు. తమ డిమాండ్లను పరిష్కరించకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆందోళనలో ఏపీ మత్స్యకార కార్మిక సంఘం ఉపాధ్యక్షురాలు సీహెచ్ రమణి, వివిధ సంఘాల నాయకులు సంగాడి ఈశ్వరరావు, పెద్దింశెట్టి వెంకటేశ్వరరావు, బడే సత్యారావు, కోనాడ తాతారావు, మైలపల్లి బుజ్జి, పిక్కి రాజు, వీరబాబు, బొడ్డు నాగేశ్వరరావు, ఆనంద్, కొత్త కాకినాడ, ఉప్పలంక, ఏటిమొగలకు చెందిన మత్స్యకారులు పాల్గొన్నారు.



జనసేన పార్టీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న మత్స్యకారులు

'వీవోఏలకు కనీస వేతం అమలు చేయాలి'

కాకినాడ సిటీ, జూలై 21 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాల బలోపేతం, ఆర్థిక స్వయం సమృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న వీవోఏలకు కనీస వేతం అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని టీఎన్టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సబ్బతి ఫణేశ్వరరావు పేర్కొన్నారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వీవోఏల సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. వీవోఏల సంఘ జిల్లా నాయకురాళ్లు మల్లవరపు రమణమ్మ, దడాల జ్యోతి, సుభాషిణి, పద్మ, శ్రీదేవి, లక్ష్మి, సత్య, కుమారి, లక్ష్మితులసి, రాణి తదితరులు పాల్గొన్నారు.

పురుహూతికా అమ్మవారికి శాకంబరీ అలంకారం

పిఠాపురం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాదగయ క్షేత్రంలో కొలువైయున్న దశమ శక్తి పీఠం అధిష్ఠాన దేవతైన పురుహూతికా అమ్మవారికి సోమవారం శాకంబరీ అలంకారం చేశారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

కూచిపూడి నృత్య ప్రదర్శన

పెద్దాపురం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మరిడమ్మ దేవస్థానంలో ధర్మపథంలో భాగంగా సోమవారం సుమారు 50 మంది కళాకారులు తమ నృత్యాలతో ఆకట్టుకున్నారు. వీరిని దేవస్థానం సహాయ కమిషనరు కుర్రం విజయలక్ష్మి, ఫౌండర్ ట్రస్టీ చింతపల్లి శ్రీహర్ష అభినందించారు.

పురుగుల మందుల దుకాణాల్లో తనిఖీలు

గొల్లప్రోలు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పురుగుల మందుల దుకాణాల్లో వ్యవసాయ శాఖ సహాయ సంచాలకురాలు పి.స్వాతి సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఇన్‌వాయిస్‌లు, స్టాకులు పరిశీలించారు. వ్యవసాయాధికారి కేవీవీ సత్యనారాయణ, వీఏఏలు ఓలేటి లక్ష్మీరెడ్డి, పుట్ట ఉదయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

జగన్ ఆర్థిక ఉగ్రవాది

మద్యం కుంభకోణంలో రూ.32వేల కోట్లు రికవరీ చేయాలి

జగన్ అక్రమ ఆస్తులను స్వాధీనం చేసుకోవాలి: పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ

పిఠాపురం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో కీలక పాత్రధారిగా ఉన్న మాజీ సీఎం జగన్ అక్రమంగా సంపాదించిన ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని పేదల సంక్షేమ పథకాలకు వినియోగించాలని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ డిమాండ్ చేశారు. పిఠాపురంలోని టీడీపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మద్యం కుంభకోణంలో జగన్‌తో పాటు వైసీపీ నేతలు నొక్కేసిన రూ.32వేల కోట్లను రికవరీ చేయాలన్నారు. జగన్‌ను ఆర్థిక ఉగ్రవాదిగా అభివర్ణించారు. మద్యం స్కామ్‌లో రూ.3,200 కోట్లు ఎక్కడ ఉన్నాయో కనిపెట్టేందుకు జగన్ ప్యాలెస్‌ల్లో అధికారులు తనిఖీలు చేయాలన్నారు. ఈ స్కామ్‌లో అరెస్టు అయిన ఎంపీ మిథున్‌రెడ్డి గతంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో బెదిరింపులకు పాల్పడి మైనింగ్, లాటరైట్ లీజులను లాక్కొన్నారు ఆరోపించారు. కొడవలి కొండను కబళించారన్నారు. కాకినాడ పోర్టు, సెజ్‌ను అరబిందోకు బలవంతంగా రాయించడంలో మిథున్‌రెడ్డి పాత్ర ఉందన్నారు. వీటిపైనా దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో మద్యం సొమ్మును విచ్చలవిడిగా ఖర్చుపెట్టారని ఆరోపించారు. సమావేశంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



టీడీపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

గ్రంథాలయ సంఘ జిల్లా అధ్యక్షుడిగా కిరణ్

కాకినాడ రూరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు విజ్ఞానాన్ని అందించడమే కాకుండా నూతన ఆలోచనలు రేకెత్తించి సృజనాత్మకతను పెంపొందించడంలో కేంద్ర బిందువులుగా నిలిచాయని తూర్పు గోదావరి జిల్లా గ్రంథాలయ సంఘానికి అధ్యక్షుడిగా ఎన్నికైన ఐడియల్ కళాశాల కరస్పాండెంట్ పీఎస్ఎస్ కిరణ్ అన్నారు. కాకినాడ శ్రీవేణుగోపాల సంస్కృత ప్రచార సభ కార్యాలయంలో జిల్లా గ్రంథాలయ సంఘ ఉపాధ్యక్షుడు అడబాల రత్నప్రసాద్ అధ్యక్షతన సోమవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంఘానికి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పీఎస్ఎస్ కిరణ్, ఉపాధ్యక్షులుగా అడబాల రత్నప్రసాద్, పి.వెంకన్నబాబు, కార్యదర్శిగా చింతపల్లి సుబ్బారావు, సహాయ కార్యదర్శిగా నలాది సాయి సత్యనారాయణ, పి.సుబ్బరాజు, కోశాధికారిగా సాయిబాబా, కార్యవర్గ సభ్యులుగా వక్కలంక రామకృష్ణ, జీవీ కృష్ణంరాజు, జీవీకే వర్మ, డాక్టర్ ఆలపాటి శ్రీనివాస్‌లను ఎన్నుకున్నారు. అధ్యక్షుడు కిరణ్ మాట్లాడుతూ తన తల్లి చిరంజీవినీకుమారి ఆశయ సాధనకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పద్మజావాణి, డాక్టర్ శిరీష, బీఎస్ఆర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కిరణ్

అంగన్వాడీ కార్యకర్తల ధర్నా

సర్పవరం జంక్షన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీలకు ఎఫ్ఆర్‌సీ యాప్ రద్దు చేయాలని కోరుతూ సోమవారం సర్పవరంలోని ఐసీడీఎస్ సీడీపీవో కార్యాలయం ఎదుట అంగన్వాడీ కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. కాకినాడ రూరల్ ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు ఎ.వీరమణి, వీరవేణి, సీఐటీయూ కార్యదర్శి టి.రాజా మాట్లాడుతూ గతంలో పోరాడి సాధించుకున్న మట్టి ఖర్చుల జీవోను తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కరపలో అంగన్‌వాడీ ఆయా మృతి చెంది ఆరు నెలలు గడుస్తున్నా నేటికీ మట్టి ఖర్చులు మంజూరు కాలేని దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సత్యవేణి, రాజేశ్వరి, లక్ష్మి, తనూజ, అప్పలకొండ, చామంతి, వరలక్ష్మి, రాజేశ్వరి, లక్ష్మి, పద్మ, బేబీ తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురం (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ వర్కర్ల జీతాలు పెంచాలని, ఎఫ్ఆర్‌సీ యాప్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. గతంలో ఇచ్చిన సెల్‌ఫోన్లు పాడైనందున కొత్తవి ఇవ్వాలని, పని ఒత్తిడి తగ్గించాలని నినాదాలు చేశారు. పలువురు బాలింతలు వీరి ఆందోళనకు మద్దతు తెలిపారు. ఆందోళనలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషబాబ్జీ, సంఘ నాయకులు తులసీదేవి, విజయశాంతి, ప్రజావాణి, నళిని, పద్మకుమారి, బేబీరాణి, బేబీ, వెంకటలక్ష్మి, రాఘవమ్మ తదితరులు పాల్గొన్నారు.

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి): ఫేస్ యాప్ రద్దు చేయాలని కోరుతూ ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ఏపీ అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ సభ్యులు సోమవారం ధర్నా నిర్వహించారు. దాడి బేబీ, మహాలక్ష్మి, రాజేశ్వరి, వాణి తదితరులు పాల్గొన్నారు.

'ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటం చేయాలి'

పెద్దాపురం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి వైసీపీ శ్రేణులు పోరాటం చేయాలని ఆ పార్టీ పెద్దాపురం నియోజకవర్గ కో-ఆర్డినేటర్ దవులూరి దొరబాబు కోరారు. మండలంలోని కాండ్రకోటలో సోమవారం జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పెద్దాపురం మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, జడ్పీటీసీ గవరసాన సూరిబాబు, రాజశేఖర్, పల్ల గంగారావు, రంగనాథం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

100 పడకల ఆసుపత్రి పనులు ఆరంభం

పిఠాపురం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం (ప్రభుత్వాసుపత్రి)ని 100 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేసే పనులకు అవసరమైన యంత్రాల రాక ప్రారంభమైంది. రూ.35 కోట్ల వ్యయంతో అదనపు భవనాలు, ఆపరేషన్ థియేటర్లు, వైద్యుల గదులు, ఇన్, ఔట్ పేషెంట్ బ్లాకుల నిర్మాణానికి గతంలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ శంకుస్థాపన చేశారు. ఈ పనులను వేగంగా పూర్తిచేసి పిఠాపురం, పరిసర ప్రాంతాల ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందిస్తామని అప్పుడు ప్రకటించారు. ఇందుకు అనుగుణంగా పనులు దక్కించుకున్న కాంట్రాక్టు సంస్థ ముందుగా భవనాల నిర్మాణానికి అవసరమైన సామగ్రి తరలింపు ప్రారంభించింది. పైల్స్ ఫౌండేషన్ వేసేందుకు భారీ మెషీనరీ ఆదివారం రాత్రి పిఠాపురం చేరుకుంది. మెషీనరీని లోపలకు తీసుకెళ్లేందుకు ఆసుపత్రి ప్రధాన ద్వారం వద్ద అడ్డంగా వున్న బోర్డు, లైట్లను సోమవారం తొలగించారు. అనంతరం భారీ మెషీనరీని ఆసుపత్రి ఆవరణలోకి తీసుకువెళ్లారు. ఒకట్రెండు రోజుల్లో పనులు ప్రారంభిస్తామని అధికారులు చెప్పారు.



శ్రీయువసేన సహాయ నిధికి రూ.50వేలు అందజేస్తున్న చంద్రశేఖర్

పేద విద్యార్థుల చదువుకు రూ.50వేలు అందజేత

కాకినాడ సిటీ, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఏ ఆధారం లేని పేద విద్యార్థుల చదువు నిమిత్తం శ్రీయువసేన సహాయ నిధికి నగరంలోని టీ పొడి హోల్‌సేల్ వ్యాపారి మల్ల చంద్రశేఖర్ రూ.50వేలు ఆర్థిక సాయం ప్రకటించారు. ఈ మొత్తాన్ని శ్రీయువసేన బ్లడ్ బ్యాంక్ చైర్మన్ బొల్లం సతీష్‌కు సోమవారం అందజేశారు. చంద్రశేఖర్ దంపతులను శాలువాతో సత్కరించి అయోధ్యరాముని చిత్రపటం బహూకరించారు. సీహెచ్ దుర్గా రావు, వంశీ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

కాజులూరు (కరప), జూలై 21 (ఆంధ్రజ్యోతి): పూర్తిస్థాయిలో రోడ్లు వేసి మౌలిక సదుపాయాలు కల్పించి గ్రామాలను సుందరంగా తీర్చిదిద్దుతామని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. కాజులూరు మండలం గొల్లపాలెంలో రూ.2.80 కోట్ల నాబార్డు నిధులతో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. కోటిపల్లి-శలపాక మధ్య రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో డీఈ ఏఎస్ఎన్ బాబు, ఎంపీడీవో జె.రాంబాబు, ఏఈ వెంకటేశ్వరరావు తదితరులు అధికారులు పాల్గొన్నారు.

రెండు కుటుంబాలకు ఆర్థిక సాయం

కరప, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న రెండు కుటుంబాలకు మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆర్థిక సాయం పంపిణీ చేశారు. కిడ్నీ సమస్యతో బాధపడుతున్న గొల్లపాలేనికి చెందిన నామన రామదుర్గ మణికంఠకు రూ.10వేలు, రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గుండారం నాగేశ్వరరావుకు చికిత్స కోసం రూ.10వేలు అందించారు.



సోలార్ వ్యవస్థను ప్రారంభిస్తున్న మంత్రి సుభాష్

పీఎం సూర్యఘర్‌తో విద్యుత్ ఆదా

కాజులూరు (కరప), జూలై 21 (ఆంధ్రజ్యోతి): పీఎం సూర్యఘర్ పథకంతో విద్యుత్ ఆదా అవుతుందని మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. కాజులూరు మండలం గొల్లపాలెంలో గుబ్బల సోమసుందరిమణి ఇంటిపై ఏర్పాటుచేసిన 3కిలోవాట్ల సామర్థ్యం గల సోలార్ వ్యవస్థను మంత్రి సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జె.రాంబాబు, డీఈ ఎన్.ఉదయభాస్కర్, డీఈఈ కె.మురళీమోహన్, ఏఈ వీర్రెడ్డి, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో యోగేష్, లోకేష్ ప్రతిభ

పెద్దాపురం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్టణంలో జరిగిన 11వ స్టేట్ ఓపెన్ కరాటే పోటీల్లో సీనియర్స్ విభాగంలో యోగేష్, జూనియర్స్ విభాగంలో లోకేష్ ప్రతిభ కనబరిచారు. వీరంతా పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో యాసలపు సూర్యారావు భవనంలో శిక్షణ పొందారు. వీరిని వీసీసీ గౌరవాధ్యక్షుడు బుద్దా శ్రీనివాస్, కూనిరెడ్డి అరుణ, అరుణ్ అభినందించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత

సామర్లకోట, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హుస్సేన్‌పురానికి చెందిన యవర్న దుర్గకు వైద్య నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.40,028 మంజూరైంది. ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప సోమవారం అందజేశారు. తెలుగుదేశం పార్టీ నాయకులు చల్లా బుజ్జి, కంటే జగదీష్‌మోహన్ (బాబు) తదితరులు పాల్గొన్నారు.

శ్రీరుద్ర సహిత నవగ్రహ యాగ పూజలు

సామర్లకోట, జూలై 21 (ఆంధ్రజ్యోతి): గోదావరి తీరాన వెలసిన హరిహర క్షేత్రం అన్నపూర్ణా సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో తొమ్మిదో రోజైన సోమవారం శ్రీరుద్ర సహిత నవగ్రహ యాగం అత్యంత వైభవంగా జరిగింది. యాగ నిర్వాహకుడు, ఆలయ వ్యవస్థాపకుడు పరమానందగిరి స్వామి, ఆలయ కార్యదర్శి బాలకానందగిరి స్వామి ఆధ్వర్యంలో ఉదయం విఘ్నేశ్వర పూజ, అంకురార్పణ పూజలు, నవగ్రహ శాంతి హోమం, మంటపారాధన జరిపారు. బుధవారం పూర్ణాహుతి నిర్వహిస్తామన్నారు. శాంతికర కల్యాణం నిర్వహించి భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహిస్తామని యాగ నిర్వాహకుడు పరమానందగిరి స్వామీజీ తెలిపారు. కాగా సోమవారం మహిళలు అధిక సంఖ్యలో హాజరై సామూహిక కుంకుమార్చన పూజల్లో పాల్గొన్నారు. ఆలయ పండితులు పెండ్యాల సుబ్రహ్మణ్యం, మణికంఠ విశేష పూజలు జరిపించారు.

పసల్ బీమా పథకంపై అవగాహన ఉండాలి

శంఖవరం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రైతులందరూ పసల్ బీమా పథకంపై అవగాహన కలిగి ఉండాలని మండల వ్యవసాయాధికారి పి.గాంధీ అన్నారు. స్థానిక రైతు సేవాకేంద్రంలో సోమవారం సిబ్బందికి పథకం వివరాలు తెలియజేశారు. సాగు చేస్తూ బ్యాంకులోను లేని రైతులు ఈ పథకం ద్వారా లబ్ధి పొందవచ్చని, 80శాతం రాయితీపై డ్రోన్లు అందజేస్తున్నామని తెలిపారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

ఘనంగా విశ్వ కోయ భాషా దినోత్సవం


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో అపూర్వ భరత్

చింతూరు, జూలై21 (ఆంధ్రజ్యోతి): చింతూరు, చట్టిలో సోమ వారం విశ్వ కోయ భాషా దినోత్స వాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీ ఉద్యమకా రులైన కొమురంభీం, బిర్సాముండా విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆదివాసీ జెండాను ఆవిష్కరించారు. తర్వాత విద్యార్థులతో ర్యాలీ, ఆదివాసీ సంప్రదాయ పెద్దలకు సన్మాన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్ పాల్గొని మాట్లాడుతూ కోయ భాషను పరిరక్షించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు జల్లి నరేష్, కుర్సం సుబ్బారావు, సీసం సురేష్, ఉద్యోగ సంఘాల నాయకులు మడివి నెహ్రూ, తిమ్మసాయి, ఆత్రం నవీన్, సోడె నారాయణ, ఎర్రంపేటలో నిర్వహించిన కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు సోడె మురళి, కుంజా శ్రీను, తెల్లం కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఎటపాక: విశ్వ కోయ భాషా దినోత్సవాన్ని ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర కోశాధికారి ఉమ్మల దుర్గారెడ్డి అన్నారు. సోమవారం చిన్ననల్లకుంట ఆశ్రమఉన్నత పాఠశాలలో కోయభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఏటీప రాష్ట్ర కార్యదర్శి పూసం శ్రీను, ఊకే రాంబాబు, తెల్లం నవీన్, భద్రయ్య, గుండి లక్ష్మణ్ పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

రంపచోడవరం: ఆదివాసీ సంస్కృతీ, సంప్రదాయాలతో పాటు కోయ భాషను కూడా కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ సంయుక్త కార్యదర్శి మడకం వరప్రసాద్ దొర అన్నారు. సోమవారం పెదకోరుమిల్లిలో విశ్వకోయ (గోండి) భాషా దినోత్సవ సంబరాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో చవలం శుభకృష్ణదొర, ప్రధానోపాధ్యాయుడు పొడియం పండుదొర, కుర్ల ప్రభాకర్‌రెడ్డి, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ పండమ్మ, మాజీ సర్పంచ్ కారం వెంకటేశ్వర్లుదొర, సారపు బాపన్నదొర, సారపు స్వామిదొర, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే


ప్రజలకు పథకాల గురించి వివరిస్తున్న శిరీషదేవి, తదితరులు

రాజవొమ్మంగి జూలై 21 (ఆంధ్రజ్యోతి) : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి అన్నారు. సోమవారం జడ్డంగి పంచాయతీ పరిధిలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా జడ్డంగిలో పీఏసీఎస్ ద్వారా నిర్మించిన బహుళ ప్రయోజన సౌకర్య గోదామును ప్రారంభించారు. అనంతరం రైతులకు సబ్సిడీపై ఎరువులను అందించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ లోతా లక్ష్మణరావు,టీడీపీ నాయకులు గొల్లపూడి పెద్దిరాజు, గణజాల తాతారావు, రాజవొమ్మంగి సొసైటీ సీఈవో జె.గోపాలకృష్ణ, అప్పారావు, తదితరులు ఉన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

వై.రామవరం, జూలై 21(ఆంధ్రజ్యోతి): అంజు కంటి ఆసుపత్రి (కాకినాడ) ఆధ్వర్యంలో సోమవారం వై.రామవరం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరంలో 18 మందికి శస్త్రచికిత్స అవసరమని గుర్తించినట్టు ఆసుపత్రి సిబ్బంది తెలిపారు. దీనికి డాక్టర్ సాయిప్రియ హాజరై 79 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 35 మందికి కళ్లద్దాల కోసం రుసుం తీసుకుని ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది, టీడీపీ మండల అధ్యక్షులు పల్లాల వెంకటరమణారెడ్డి, కుప్పా శ్రీను, పల్లాల పండురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'భూములు స్వాధీనం చేసుకోవాలి'

ఎటపాక, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి రాష్ట్రంలో పోలవరం ముంపు భూములకు నష్టపరిహారం పొంది, ప్రస్తుతం ఆ భూములు కౌలుకు ఇస్తూ రూ. లక్షల్లో కౌలు సొమ్ములు పొందుతున్న భూ స్వాముల నుంచి భూములు స్వాధీనం చేసుకుని, నిరుపేద గిరిజనులకు పంచాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కాక అర్జున దొర డిమాండ్ చేశారు. సోమవారం ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఆదివాసీలు నందిగామలో పోలవరం ముంపు భూముల్లో ఆదివాసీ జెండాలతో నినాదాలు చేశారు. ఆయన మాట్లాడుతూ గతంలో పోలవరం పరిహారం పొంది, వేరే ప్రాంతాల్లో నివాసముంటూ ఇక్కడి పోలవరం భూములను ఎకరం రూ. 25 నుంచి రూ 40 వేల వరకు కౌలుకు ఇస్తూ సొమ్ములు చేసుకుంటున్నారని ఆరోపించారు. గిరిజన సంఘం నేతలు అజయ్, సొందే రామారావు, వీరమ్మ పాల్గొన్నారు.

పార్వతి మృతికి బాధ్యులైనవారిపై కేసు నమోదు చేయాలి

రంపచోడవరం, జూలై 21(ఆంధ్రజ్యోతి): ఏరియా ఆసుపత్రిలో ఈనెల 11వ తేదీన వై.రామవరం మండలం జాజిగడ్డకి చెందిన గిరిజన మహిళా కాకూరి పార్వతి మృతికి కారకులైన వైద్యులపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో సోమవారం ఐటీడీఏ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈసందర్భంగా ఐటీడీఏ పీవో సింహాచలానికి ఫిర్యాదు చేశారు. ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను మాట్లాడుతూ ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యం కారణంగా పార్వతి మరణించిందన్నారు. ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు తీగల బాబూరావు, మోడిగ నూకరాజు, ఆదివాసీ చైతన్య వేదిక జిల్లా అధ్యక్షుడు వి.లచ్చిరెడ్డి, బొరగా ఎర్రమ్మ, పీట ప్రసాద్, పురుషోత్తం, మల్ల సత్యనారాయణ, కడపల కాసులమ్మ, అబ్బాయిదొర, కారు నాగరాజు, మామిడి చిన్నారెడ్డి పాల్గొన్నారు.

మండల మహిళా సమైక్య సమావేశం

మారేడుమిల్లి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైతు సమృద్ధి కేంద్రంలో సోమవారం మండల మహిళా సమైక్య సమావేశాన్ని ఏర్పాటు చేశారు. దీనికి మహిళా సంఘాలు హాజరయ్యాయి ఎంపీడీవో శ్రీనివాస విశ్వనాథ్ పాల్గొని మాట్లాడుతూ సకాలంలో తీసుకున్న రుణాలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం దుర్గాప్రసాద్, తదితర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఐటీడీఏ గ్రీవెన్స్‌కు 83 ఫిర్యాదులు


అర్జీదారులతో మాట్లాడుతున్న పీవో

రంపచోడవరం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం అధికారులను ఆదేశించారు. ఆయన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అంబేద్కర్‌తో కలిసి సుమారు 83 అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్లు రుక్మాండయ్య, షరీఫ్, ఏడీఎం హెచ్‌వో జి.శిరీష, డీఎల్‌పీవో నరసిం హారావు, డీఈవో వై.మల్లేశ్వరరావు, ఏడీఏలు సీహెచ్‌కేవీ చౌదరి, కె.సావిత్రి, ఏపీడీలు బి.సత్యనారాయణ, డేగలయ్య,ఈఈలు ఐ.శ్రీనివాసరావు, గాబ్రియేలు, రవికుమార్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కుండపోత వర్షం

• ఉపశమనం పొందిన రైతులు • లోతట్టు ప్రాంతాలు జలమయం


ప్రత్తిపాడులో కురుస్తున్న వర్షం


జగ్గంపేట హైవేపై కురుస్తునన వర్షం

ప్రత్తిపాడు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులో సోమవారం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఉదయం 11 నుంచి ఆకాశం మేఘావృతమై ఎడతెరిపిలేని వర్షం కురిసింది. సాయంత్రం 3గంటల వరకు వర్షంపడుతూనే ఉంది. పౌర జీవనానికి తీవ్రఅంతరాయం కలిగింది. ఈదురు గాలలు కారణంగా జక్కావారివాధిలో వృక్షం నేలకొరింది. దీంతో విద్యుత్ అంతరాయం ఏర్పడి స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

జగ్గంపేట: జగ్గంపేటలో సోమవారం మధ్యాహ్నం కుండపోత వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఇటీవల వేసి అకుమడులకు ఈ వర్షం ఊరటనిచ్చింది.

తునిరూరల్: గత వారం రోజులుగా సూర్య ప్రతాపానికి విలవిల్లాడిన మండల ప్రజానీకం సోమవారం కురిసిన వర్షానికి ఉపశమనం పొందారు. నారుమడులకు నీరందక పోవడంతో చతికిలపడిన రైతన్నకు తాజాగా కురిసిన వర్షం ఎంతో ఉపశమనాన్ని ఇచ్చింది.

రైతులకు ఊరట

కిర్లంపూడి: వర్షాకాలం ప్రారంభమైనా ఎండలు మండుతుండడంతో పొలాలకు నీరు లేకుండా పోయింది. మండలంలో సోమవారం ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లన్నీ జలమయ్యాయి. పొలాల్లోకి నీరు చేరుకోవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న యనమల రామకృష్ణుడు

రైతుల ఉన్నతికే వ్యవసాయ పరపతి సంఘాలు

• టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు

తునిరూరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రైతుల అవసరాలకే అనుగుణంగా వ్యవసాయ పరపతి సంఘాల పాలకవర్గాలు పనిచేయాలని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు అన్నారు. తుని మండలం తేటగుంటలో ఎస్‌ఎన్‌పట్నం పీఏసీఎస్ పాలకవర్గ ప్రమాణస్వీకారానికి యనమల ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అధ్యక్షుడు పేరూరి వెంకటచిన్నకృష్ణయ్య, డైరెక్టర్లు చోడరాజు చిరంజీవిరాజు, లాలం రాజేశ్వరి యనమల సమక్షంలో ప్రమాణస్వీకారం చేశారు. యనమల మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యసాధనలో పాలకమండలి ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్‌బాబు, యనమల రాజేష్, టీడీపీ మండలాధ్యక్షుడు చింతమనీడి అబ్బాయి, మోతుకూరి వెంకటేష్, వెలగా వెంకట కృష్ణారావు, అప్పలరాజు, నవీన్, దుర్గారావు, సత్తిబాబు ఉన్నారు.

రిలే నిరాహార దీక్ష విరమణ

శంఖవరం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): భారీ లారీలవల్ల రోడ్లు ఛిద్రమవుతున్నాయనే కారణంతో రిలే నిరాహార దీక్ష చేపట్టిన మేకల కృష్ణ దీక్షను విరమణ చేశారు. సోమవారం ఉదయం దీక్ష చేపడతారనే సమాచారంతో అన్నవరం పోలీసులు కృష్ణను ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. ధర్నాకు ఎటువంటి అనుమతులు లేవని తెలిపారు. ధర్నా చేపట్టనని అంగీకారం తెలపడంతో పూచికత్తుల ద్వారా విడిచిపెట్టినట్టు తెలిపారు. దీంతో దీక్షకు తాత్కాలికంగా విరమణ జరిగింది.

నేను అభివృద్ధికి బ్రాండ్ అంబాసిడర్

• ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట, జూలై 21 (ఆంధ్రజ్యోతి): తాను అభివృద్ధికి బ్రాండ్ అంబాసిడర్ నని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో సోమవారం విలేకర్ల సమావేశంలో నెహ్రూ మాట్లాడుతూ నియోజకవర్గంలో రూ.350కోట్లతో మల్లవరం లిఫ్టు, రింగ్ రోడ్డు, సామర్లకోట గోకవరం రోడ్డు, కిర్లంపూడి సామర్లకోట రోడ్డు పూర్తి చేస్తే ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడుతుందని కానీ అప్పటి ఎంపీగా ఉన్న తోట నరసింహం రాజుపాలెం రామ వరం రోడ్డు అడిగాడు కాని దానిపై దృష్టి పెట్టక బాధ్యతలేక ఎక్కడికి పోయి ందో తెలియదన్నారు. ఇప్పటికీ ఆ రోడ్డు పరిస్థితి ఎలా ఉందో మీ అందరికీ తెలి సిన విషయంకదా అని అన్నారు. నువ్వు రోజు ఆ రోడ్డు మీద వస్తున్నావ్ ఒక్కసారైనా దృష్టి పెట్టావా అని అడిగారు. మోడల్ డిగ్రీ కాలేజ్ తెచ్చానని గొప్పలు చెప్పుకుంటున్నాం ఎక్కడో జగ్గంపేటకు 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న అటవీ ప్రాంతం జటాత్రి కొండపై 25సెంట్లు శంకుస్థాపన చేసి విద్యార్థులు వెళ్లడానికి అవకాశం లేని ప్రాంతం కావడంతో అప్పటి జగ్గంపేట వైస్ ప్రెసిడెంట్ కోర్టుకు వెళ్లి దాన్ని నిలుపుదల చేయటంతో మళ్లీ జగ్గంపేట నడిబొడ్డులో సర్వాంగ సుం దరంగా అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబుతో శంకుస్థాపన చేయటమే కాకుండా ఒక సంవత్సరంలో పూర్తి చేసి మళ్లీ ఆయనతోనే ప్రారంభించడం జరిగిందని అన్నారు. నువ్వు గత ప్రభుత్వంలో రెండేళ్లు ఇన్చార్జిగా పని చేశావు అప్పుడు మల్లవరం ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయాలని ఎందుకు అనిపించలేదు అని ప్రశ్నించారు. సమావేశంలో ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, పోతుల మోహనరావు, కొత్తకొండబాబు, బుర్రి సత్తిబాబు, పాలచర్ల నాగేంద్ర చౌదరి, జనసేన నాయకులు ఉలిసి ఐ రాజు పాల్గొన్నారు.

రుద్రభూమి అధ్వానంపై ఎమ్మార్పీఎస్ నాయకుల ఆందోళన

రౌతులపూడి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రౌతులపూడి మాదిగ కులస్తుల రుద్రభూమి అధ్వానంగా ఉండడంపై ఎమ్మార్పీయస్ నాయకులు కొత్తెల చంటి, చామంద్రరాం బాబు, కాకాడ అబ్బు, ధారపల్లి రాంబాబు ఆందోళన చేశారు. సోమవారం ఎస్సీ మాదిగ పేటకు చెందిన మోర్తా మల్లయ్య మ్మ(80) అనారోగ్యంతో మృతిచెందగా మృతదేహాన్ని రుద్రభూమికి తరలించే సమయంలో భారీ వర్షం పడింది. దీంతో రహదారిలో వర్షంనీరు చేరడంతో మృతదేహాన్ని తీసుకుని వెళ్లడానికి, కప్పెట్టేందుకు గొయ్యి తీస్తున్న సమయంలో ఇబ్బందులు పడ్డారు. అధికారులు స్పందించి రుద్రభూమిని అభి వృద్ధి చేయాలని వారు కోరారు.

ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య కార్యకర్తలు వారధిగా ఉండాలి

టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల

తునిరూరల్, జూలై 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య కార్యకర్తలు వారధులుగా ఉండాలని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు కోరారు. కోటనందూరు మండలం జగన్నాధపురం గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు ఆ పార్టీకి రాజీనామా చేసి తేటగుంట టీడీపీ క్యాంపు కార్యాలయంలో యనమల సమక్షంలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు యనమల రాజేష్, టీడీపీ మండలాధ్యక్షుడు చింతమనీడి అబ్బాయి, కోటనందూరు మండలాధ్యక్షుడు పోతల సూరిబాబు, గాడి రాజబాబు తదితరులున్నారు.

తాగునీరు వృధాగా పోతున్నా పట్టించుకోరా?

కోటనందూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): కెకొట్టాంలో తాగునీరు పైపులైన్ మరమ్మతులకు గురై నీరు వృధాగా పోతోంది. గ్రామానికి తాగునీరు కోటనందూరు శివారు నుంచి 6 కిలోమీటర్ల దూరం నుంచి పైపులైన్ ద్వారా నీరు వెళుతోంది. అలాంటి పైపులైన్ కోటనందూరు- కొట్టాంకు మధ్యలో ఉన్న ఎల్‌డి పేట గ్రామం వద్ద పొలాల్లో మరమ్మతులకు గురై మూడు నెలల నుంచి నీరు వృధాగా పోతోంది. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామని మాజీ సర్పంచ్ చిటికెల సత్యనారాయణ తెలిపారు.

ఎమ్మెల్యే పరామర్శ

ప్రత్తిపాడు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరానికి చెందిన టీడీపీ జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు ఇందన ఏసుబాబును సోమవారం ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పరామర్శించారు. కంటి శస్త్రచికిత్స చేయించుకుని ఇంటి వద్ద కోలుకుంటున్న ఆయన్ను పరామర్శించారు. కాకినాడ పార్లమెంటరీ టీడీపీ ఉపాధ్యక్షుడు కొమ్ముల కన్నబాబు, మండలాధ్యక్షుడు అమరాది వెంకట్రావు, స్థానిక టీడీపీ నాయకులు బొల్లు కొండబాబు, దాట్ల అప్పన్నబాబు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు బొల్లు వెంకటేశ్వరరావు (చిన్న) తదితరులు ఉన్నారు.


తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బంగార్రాజు

ప్రత్తిపాడులో లిబరేషన్ ప్రదర్శన, ధర్నా

సమస్యలు పరిష్కరించాలని తహశీల్దార్‌కు వినతి

ప్రత్తిపాడు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులో సోమవారం సీపీఐ ఎంఎల్ లిబరేషన్ ఆధ్వర్యంలో అఖిల భారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం, అఖిల భారత ప్రగతిశీల మహిళాసంఘం, జిల్లా గిరిజన సంఘాలు సంయుక్తంగా ప్రదర్శన, ధర్నా, ఆందోళనలు నిర్వహించాయి. లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి బుగతా బంగార్రాజు, జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జునరావు, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రేచుకట్ల సింహాచలంల ఆధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి తహసీల్దార్ ఎం.సూర్యప్రభకు వినతిపత్రం అందజేశారు. పలు గ్రామాల కార్యకర్తలు, నాయకులు గొడుగు సత్యనారాయణ, ఆర్.రత్నం, తాడి నాగేశ్వరరావు, లక్ష్మణరావు, చిన్నం అర్జునుడు, దేవతయ్య, లక్ష్మి, దాను, వీరబాబు, అప్పారావు పాల్గొన్నారు.


ఏలేశ్వరంలో జలమయమైన ప్రధాన రహదారి

అధ్వానంగా డ్రైనేజీ వ్యవస్థ

• వర్షం నీటితో నిండిన రహదారులు

ఏలేశ్వరం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉండడంతో సోమవారం కురిసిన వర్షానికి రహదారులన్నీ జలమయమయ్యాయి. ఏ ఒక్క రోడ్డుకు డ్రైనేజీలు, మరమ్మతులు చేపట్టకపోవడంతో ఎటు చూసినా గుంతలతో చెరువులను తలపిస్తున్నాయి. దీంతో వర్షపు నీరుపోయే మార్గం లేక పోవడంతో ఎక్కడి నీరు అక్కడే నిలిచిపోతోంది. నగర పంచాయతీ పరిధిలో మెయిన్ రోడ్డు, షిర్డీనగర్, మెక్కారావు కాలనీ, చైతన్యనగర్, లక్ష్మవరం కాలనీలలో సీసీ రోడ్లు అభివృద్ధి చేయాల్సి ఉండగా అధికారులు నిర్లక్ష్యంగా వదిలేయడంతో చినుకు పడితే బురద నీరు చేరడంతో బాటసారులకు అవస్థలు తప్పడం లేదు. అధికారులు స్పందించి డ్రైనేజీ వ్యవస్థపై దృష్టిపెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

శివారు ప్రాంతాలకు తాండవ నీటిని అందించాలి


సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ సత్యనారాయణ

కోటనందూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌కు సంబంధించి తాండవ రిజర్వాయర్ నీటిని శివారు ప్రాంతాలకు అందించేందుకు చర్యలు చేపట్టాలని ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కరక సత్యనారాయణ అన్నారు. సోమవారం తాండవ రిజర్వాయర్ వద్ద డీఈ అనురాధ అధ్యక్షతన సమావేశం జరిగింది. చైర్మన్ మాట్లాడుతూ కాకినాడ, అనకాపల్లి జిల్లాలకు సంబంధించి సుమారు 60వేల ఎకరాలకు సాగునీరు అందుతున్న దృష్ట్యా రైతులందరికి పూర్తిస్థాయిలో సాగునీరు అందించాలన్నారు. రైతుల నుంచి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని అధికారులు, నీటి సంఘం చైర్మన్లను కోరారు. డీఈ మాట్లాడుతూ నీటిని వచ్చే నెల 10 లోపు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని, ఈ మేరకు స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడితో చర్చించి చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు వైస్ చైర్మన్ మేరపురెడ్డి జోగిబాబు, తుని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంకంరెడ్డి రమేష్, సొసైటీ అధ్యక్షులు సింగంపల్లి సన్యాసిదేముడు, అప్పిరెడ్డి మాణిక్యం, షేక్‌నవాబ్ జానీ, షేక్‌బాబ్జి, నందిపల్లి రమణ పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫాం పంపిణీ

తునిరూరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): వాకర్స్ హెల్త్ క్లబ్ సేవలు అద్వితీయమని వాకర్ సెంటర్ నేషనల్ ప్రెసిడెంట్ ఎం.ప్రభావతి తెలిపారు. సోమవారం తుని బ్యాంక్ కాలనీలో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థులకు యూనిఫాం పంపిణీ చేశారు. అన్నపూర్ణ ఆశ్రమ వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ చేపట్టారు.

పాఠశాలలో మొక్కలు నాటారు. కలిదిండి సత్యనారాయణరాజు, చదరం శివాజీ, డీఎస్ మూర్తి, కుందన్ సత్యనారాయణ, వాడపల్లి శ్రీను, నెల్లిపూడి నాగేశ్వరరావు, గాజులు వేణు గోపాలస్వామి, కొలసానపల్లి పద్మ, బత్తిన నాగేశ్వరరావు ఉన్నారు.

పురుగుల మందుల దుకాణాల్లో తనిఖీలు

గొల్లప్రోలు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పురుగుల మందుల దుకాణాల్లో వ్యవసాయ శాఖ సహాయ సంచాలకురాలు వి.స్వాతి సోమవారం తనిఖీలు నిర్వహించా రు. ఇన్వాయిస్‌లు, స్టాకులు పరిశీలించారు. వ్యవసాయాధికారి కేవీవీ సత్యనారాయణ, వీఏఏలు ఓలేటి లక్ష్మీరెడ్డి, పుట్ట ఉదయకుమార్ తదితరులు పాల్గొన్నారు.


ఆదిత్యలో చెస్ పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

'ఆదిత్య'లో చెస్ పోటీలు

గండేపల్లి, జూలై 21(ఆంధ్రజ్యోతి): సూరంపాలెంలోని ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో ఇంటర్నేషనల్ చెస్ డే సందర్భంగా ఫార్మసీ విద్యార్థులకు చెస్ పోటీలు నిర్వహించినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రవిశంకర్ తెలిపారు. విజేతలకు సర్టిఫికెట్స్ అందించి మెడల్‌తో సత్కరించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ కోఆర్డినేటర్ సాయిప్రియాంక, పీడీ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో యూరియా



జగ్గంపేట, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో రామవరం, కాండ్రేగుల, మల్లిశాల గ్రామాల్లో తప్ప మిగతా అన్ని గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో యూరియా అందుబాటులో ఉందని మండల వ్యవసాయాధికారి ఎస్.నరసింహం ప్రకటనలో తెలిపారు. 2, 3 రోజుల్లో ఆ 3 గ్రామాల్లో కూడా యూరియా అందుబాటులోకి వస్తుందన్నారు. సోమవారం పలువురి యూరియా అందజేశారు. కార్యక్రమంలో జగ్గంపేట అగ్రికల్చర్ అసిస్టెంట్ శ్యామ్ పాల్గొన్నారు.

అన్న క్యాంటిన్‌లో పేదలకు అన్నదానం

జగ్గంపేట, జూలై 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక కాకినాడ రోడ్డులో గల ఎన్టీఆర్ స్మారక మందిరం వద్ద నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్‌లో సోమవారం గండేపల్లి మండల ఎన్టీరాజాపురానికి చెందిన కంటిపూడి వెంకటరాయుడు సత్యవతి దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారుడు గండేపల్లి సొసైటీ చైర్మన్ కంటిపూడి సత్తిబాబు ఆర్థిక సాయంతో పేదలకు అన్నదానం చేశారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ముఖ్య అతిథిగా హాజరై పేదలకు అన్నం వడ్డించారు. టీడీపీ గండేపల్లి మండలాధ్యక్షుడు పోతుల మోహన్‌రావు, ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, పాలచర్ల నాగేంద్ర చౌదరి, బొల్లంరెడ్డి రామకృష్ణ, సాని పిన్ని విశ్వేశ్వరరావు,(చినబాబు) కె.తిన వెంకన్న చౌదరి(బాబి) పాల్గొన్నారు.



భోజనాలు వడ్డిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

90 లీటర్ల నారా స్వాధీనం

ప్రత్తిపాడు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ కృష్ణకుమారి ఆదేశాల మేరకు స్థానిక ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ పి.శివప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం ఎక్సైజ్ సిబ్బంది సారా తయారీ కేంద్రాలపై దాడులు జరిపారు. ఈ దాడుల్లో 90 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని పెద్దిపాలెనికి చెందిన బొందల వీర కుమార్‌ను అరెస్ట్ చేశారు. సారా తీసుకుంటున్న రీసు సత్తిబాబు, వీరకుమార్‌లు, బెల్లం సరఫరా చేసిన కొరుప్రోలు గోపాలకృష్ణపై కూడా కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. దాడుల్లో స్థానిక ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ పున్నం వంశీరామ్, సిబ్బంది పాల్గొన్నారు.

నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

తునిరూరల్, జూలై 21(ఆంధ్రజ్యోతి): కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ సోమవారం తుని తహశీల్దారు కార్యాలయం వద్ద సీఐటీయూ అనుబంధ ప్రజా సంఘాలు సార్వత్రిక సమ్మె చేపట్టారు. సీఐటీయూ నాయకులు శ్రీనివాస్, ధనలక్ష్మి, ఎల్ఐసీ నాయకుడు సత్యనారాయణ, ఆశా వర్కర్స్ భవాని, మున్సిపల్ శాంతకుమారి, ట్రాన్స్‌పోర్టు సాహిద్‌ఖాసిం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటోందన్నారు. తహశీల్దారు కార్యాలయం నుంచి గొల్లఅప్పారావు సెంటర్ వరకు ర్యాలీ ప్రదర్శన నిర్వహించారు. తహశీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ శ్రీనుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గణేష్, సుబ్బలక్ష్మి, ఉమామహేశ్వరి, ఇందిరా, పుష్ప, అరుణ, రామలక్ష్మి, సుభాషిణి, భాస్కర్, అప్పారావు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.


జగన్నాథపురంలో మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్న దృశ్యం

వైరల్ జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి

కోటనందూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో వైరల్ జ్వరాలు విజృంభిస్తున్నాయని, రోగులు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ యామిని కావ్య అన్నారు. సోమవారం జగన్నాథపురం గ్రామంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఇంటింటా వెళ్లి రోగుల వివరాలు తెలుసుకొని పంచాయతీ సిబ్బంది అధ్వర్యంలో యాంటీ లార్వా స్ప్రేయింగ్ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది రమేష్, విజయ్, రామలక్ష్మి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.